ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

అనంతపురం
జిల్లా వార్తలు
శనివారం 20 సెప్టెంబరు 2025
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0

బెస్టు నరసాపురం


నాగుల గుడ్డం వద్ద నీటితో కళకళ లాడుతున్న కుంట

తీవ్ర కరువు ప్రాంతం. వర్షాకాలంలోనూ తాగునీటికి తిప్పలు పడాల్సి వచ్చేది. మూగజీవాలకు అడవిలో ఎక్కడా నీరు దొరకదు. ఎండాకాలం వచ్చిందంటే ఏ వ్యవసాయ బోరు ఎండిపోతుందో తెలియని పరిస్థితి. నీరు తగ్గడం, బోర్లు ఎండిపోతుండడంతో చాలామంది రైతులు పండ్లతోటలను తొలగించుకునేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో వాటర్ షెడ్ ఆ పంచాయతీకి వరంగా మారింది. విరివిగా చెక్ డ్యాంలు, నీటి కుంటల నిర్మాణం చేపట్టారు. నీటి చుక్కను ఒడిసి పట్టుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అవన్నీ నిండిపోయాయి. దీంతో భూగర్భ జలాలు పెరిగాయి. వ్యవసాయ బోర్లలో నీటి మట్టం పెరిగింది. నీరు లేక పంటలు తొలగించుకునే పరిస్థితి నుంచి కొత్తగా బోర్లు వేసుకుందామనే ఆలోచనకు వచ్చారు శింగనమల మండలంలోని బెస్టు నరసాపురం రైతులు. కరువుపై జలం సాధించిన విజయం ఇది.

వాటర్ షెడ్ పథకం.. వెస్టు నరసాపురానికి వరం

- చెక్ డ్యాంలు, నీటి కుంటల నిర్మాణం
- అవన్నీ నిండడంతో పెరిగిన భూగర్భజలాలు
- బోరుబావుల్లో పెరిగిన నీటిమట్టాలు
- అన్నదాతల హర్షం


వెస్టు నరసాపురం వద్ద నిండిన చెక్ డ్యాం

శింగనమల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెస్టు నరసాపురం పంచాయతీ.. కరువును జయించింది. జలాన్ని ఒడిసి పట్టడం ద్వారా అద్భుతం చేసింది. పంచాయతీలో చిన్నజలాలపురం, గురుగుంట్ల, నాగులగుడ్డం గ్రామాలున్నాయి. వీటి పరిధిలో దాదాపు 5 వేల ఎకరాల్లో వర్షాధారం, వ్యవసాయ బోర్ల కింద రైతులు పండ్ల తోటలు, ఇతర పంటలు సాగుచేసుకునేవారు. పదేళ్లగా వ్యవసాయ బోర్లలో నీటిమట్టాలు పడిపోతుండడంతో పండ్ల తోటలు, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతు దిక్కుతోచని స్థితిలో పడ్డాడు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పంచాయతీకి వాటర్ షెడ్ పథకాన్ని వర్తింపజేసింది. అందులో భాగంగా చెక్ డ్యాంలు నీటికుంటలు, రాతి కట్టల పనులు ప్రారంభం కావడంతో పంచాయతీలోని గ్రామాల సమీపంలోని గంపమల్లయ్య, దొణ రామేశ్వరకొండ ప్రాంతాల్లో 8 చెక్ డ్యాంలు, పొలాల్లో 50 వరకు నీటి కుంటలను రూ.కోటికిపైగా ఖర్చుతో నిర్మించారు. మూడు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి చెక్‌డ్యాంలు, నీటికుంటలు నిండాయి. భూగర్భ జలాలు విపరీతంగా పెరిగాయి. వ్యవసా బోర్లలో నీటిమట్టాలు పెరిగాయి. ఇవి తగ్గే పరిస్థితి లేదని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


చిన్నజలాలపురం వద్ద నిండుకుండలా చెక్ డ్యాం

100 అడుగుల్లోనే నీరు పడే అవకాశం: దాసరి గంగాధర్, నాగులగుడ్డం



నాకున్న అరెకరా భూమిలో వర్షాధారం కింద పంట సాగు చేసేవాడిని. 400 అడుగుల వరకు బోర్లు వేసినా.. నీటి చెమ్మ దొరికేది కాదు. వాటర్ షెడ్ పథకం కింద గ్రామంలో రెండు చెక్ డ్యాంలు, 18 నీటి కుంటలు నిర్మించారు. అవన్నీ నీటితో నిండిపోయి, కళకళలాడుతున్నాయి. ప్రస్తుతం 100 అడుగుల్లోనే నీరు లభిస్తోంది.

మూగజీవాలకు ఇబ్బంది ఉండదు



గ్రామ పరిధిలో వాటర్ షెడ్ పథకం కింద 5 చెక్ డ్యాంలు, 22 నీటి కుంటలు నిర్మించారు. వర్షానికి అవన్నీ నిండాయి. మూగ జీవాలకు ఏడాది పొడవునా దాహం తీర్చుకునేందుకు ఇబ్బంది ఉండదు.

- పట్నం నగేష్, చిన్నజలాలపురం

భూగర్భ జలాలు పెరుగుతున్నాయి



మా భూమి గంపమల్లయ్య కొండ ప్రాంతంలో ఉంది. అక్కడ చీనీ పంట సాగు చేశాం. నాలుగేళ్లగా బోర్లలో నీరు తగ్గుతోంది. ఈసారి ఈ ప్రాంతంలో రెండు చెక్ డ్యాంలు, 12పైగా నీటికుంటలు నిర్మించారు. వర్షానికి అవి నీటితో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే బోర్లలో నీరు పెరిగింది. భవిష్యత్తులో కూడా నీరు తగ్గే పరిస్థితి లేదు.

- లక్ష్మీరెడ్డి, వెస్టు నరసాపురం

రైతుల కళ్లలో ఆనందం..




వెస్టునరసాపురం పంచాయతీలో వాటర్ షెడ్ పథకం కింద చెక్ డ్యాంలు, నీటి కుంటలు నిర్మించాం. అవన్నీ వర్షాలకు నిండిపోవడంతో వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతుల కళ్లలో ఆనందం కనిపిస్తోంది. వాటర్ షెడ్ పథకంలో భూగర్భ జలాలు పెంచడానికి మరిన్ని నిధులు తీసుకొచ్చి, అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం.

- బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

శింగనమల మండలంలో వాటర్ షెడ్ పథకం కింద రెండు పంచాయతీలు ఎంపిక చేశాం. మెదట వెస్టునరసాపురం పంచాయతీలో చెక్ డ్యాంలు, నీటి కుంటల నిర్మాణానికి రూ.కోటి పైగా ఖర్చు చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు అవన్నీ నిండిపోవడంతో వ్యవసాయ బోర్లలో నీటిమట్టం పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు పెంచడమే వాటర్ షెడ్ లక్ష్యం.

- ఈశ్వరయ్య, వాటర్ షెడ్ పీడీ



వచ్చేసింది.. సెలవుల పండుగ

- నేడు కాంప్లెక్స్ సమావేశం.. రేపు ఆదివారం
- 22 నుంచి దసరా సెలవులు.. 3న రీ ఓపెన్



అనంతపురం విద్య, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులపై కొన్నిరోజులుగా సాగుతున్న చర్చకు తెరపడింది. స్కూల్ క్యాలెండర్ ప్రకారం నవరాత్రుల ప్రారంభం నుంచే పాఠశాలలకు సెలవులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఏడాది 22 నుంచి నవరాత్రులు ప్రారంభం కానుండగా.. రెండు రోజులు ఆలస్యంగా 24వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు సెలవులు ప్రకటించారు. దీనిని ఉపాధ్యాయ వర్గాలు తప్పుబట్టాయి. నవరాత్రుల ప్రారంభం రోజు నుంచి కాకుండా ఆలస్యంగా ఇవ్వడం ఏంటంటూ వ్యతిరేకిస్తూ వచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం సెలవులు నవరాత్రులు ప్రారంభం నుంచే ఇవ్వాలని కోరుతూ వినతి పత్రాలు ఇస్తున్నారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు దీనిని పెద్దగా (మిగతా 6వ పేజీలో...)

టైగర్ వచ్చేసింది

- జిల్లా పోలీస్‌శాఖకు కొత్త జాగిలం


జిల్లాకు వచ్చిన కొత్త జాగిలం

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏంటి ఈ టైగర్ అనుకుంటున్నారా..? ఇది పోలీసు డాగ్ పేరు. జిల్లా పోలీస్‌శాఖకు కొత్తగా ఈ జాగిలాన్ని తీసుకొచ్చారు. బెల్జియం మలనాయిజ్ జాతికి చెందిన ఈ జాగిలానికి మంగళగిరి హెడ్ క్వార్టర్స్‌లో సుమారు 10 నెలల పాటు శిక్షణ ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి శుక్రవారం తీసుకొచ్చారు. ఈ జాగిలం నేరస్తులను గుర్తించడం, కేసుల ఛేదనలో, నార్కోటిక్స్, గంజాయి, మత్తు పదార్థాలను పసిగట్టడంలో దిట్ట. ఈ జాగిలం రాకతో జిల్లా పోలీస్‌శాఖలో ఉన్న జాగిలాల సంఖ్య ఏడుకు చేరింది. జిల్లా ఎస్పీ జగదీష్ కొత్త జాగిలాన్ని పరిశీలించారు. కేసులు ఛేదనలో సవాళ్లను తిప్పికొట్టడంలో ఉపయోగపడే ఈ జాగిలం జిల్లాకు రావడంతో పోలీస్‌శాఖకు మరింత బలం చేకూరిందని ఎస్పీ పేర్కొన్నారు.

పిల్లలకు మంచి వాతావరణం కల్పించాలి

- జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్లలో వసతి పొందుతున్న పిల్లలకు మంచి వాతావరణం కల్పించాలని జేసీ శివనారాయణశర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవా రం ఆయన జిల్లా స్థాయి బాలల సంరక్షణ సిఫార్సుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పిల్లల సంరక్షణ కమిటీ, పోలీస్ శాఖ సమన్వయంతో పనిచేసి బాలల సంరక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. లైసెన్సు పొందిన చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్లను తరచూ తనిఖీ చేయాలని, పౌష్టిక ఆహారం సరఫరా, ఆరోగ్యం రక్షణ కల్పించాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 11 చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్లు ఉన్నట్లు వెల్లడించారు. పిల్లల సంరక్షణ బాధ్యతల విషయంలో సమస్యలు ఎదురవుతాయని, బాలల సంక్షేమ సమితి, జిల్లా స్థాయి సిఫారసు కమిటీ సభ్యుల ద్వారా ప్రభుత్వ పరిధిలో చర్యలను పటిష్ఠ పరచాలన్నారు. ఆ ఇనిస్టిట్యూట్‌లకు ప్రొవిజనల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ మంజూరు విషయంలో ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ మిషన్ అధికారి శ్రీదేవి, జోనల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మరో రచ్చ

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కాంపౌండ్ గేట్ నిర్మించడంతో సమస్య

- వివాదం కోర్టులో ఉంటే ఎలా కడతారని జేసీపీఆర్ ఆగ్రహం
- కార్యకర్తలతో కలిసి అక్కడికి వెళ్లే యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- గేటును మూసివేయిస్తామని హామీ.. సద్దుమణిగిన సమస్య
- క్షణక్షణం తాడిపత్రిలో ఉద్రిక్తత


కాంపౌండ్ వాల్‌ను కట్టిస్తున్న దృశ్యం

తాడిపత్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి గేటు విషయంగా మరోసారి రచ్చ రేగింది. వాస్తు ప్రకారం పడమర వైపునకు గేటు నిర్మించాలని తాడిపత్రిలోని తన ఇంటి కాంపౌండ్‌ను పెద్దారెడ్డి తొలగింపజేశాడు. ఈ విషయం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి తెలియడంతో ఆయన అనుచరులతో కలిసి అక్కడికి వచ్చేందుకు ప్రయత్నించాడు. అయితే కాలేజీ గ్రౌండ్ వద్దే పోలీసులు అతడిని అడ్డుకున్నారు. పెద్దారెడ్డి ఇంటికి సంబంధించిన వివాదం కోర్టులో నడుస్తుండగా కాంపౌండ్‌వాల్ ఎలా పగలగొట్టి, గేట్లు పెడతారని జేసీ ప్రభాకర్‌రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. గేటు మూయిస్తేనే తాను ఆందోళన విరమించుకుంటానని, లేకపోతే ఇంటివద్దకు వెళతానని భీష్మించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటివద్ద వైసీపీ కార్యకర్తలు ఉండటం, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తన కార్యకర్తలతో అక్కడికి వెళ్లేందుకు బయల్దేరడంతో ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయోనని పోలీసులు ఒకింత ఆందోళన చెందారు. వెంటనే పట్టణంలో పలు చోట్ల ఉన్న పోలీసులు అందరిని వెంటనే అక్కడకు రప్పించారు. వాగ్వాదం నేపథ్యంలో ఉన్నతాధికారులతో మాట్లాడి పెద్దారెడ్డితో గేటు మూసివేయించే విధంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు జేసీ ప్రభాకర్‌రెడ్డికి హామీ ఇవ్వడంతో ఆయన వెనుదిరిగి వెళ్లిపోయారు. సీఐలు శివగంగాధర్‌రెడ్డి, ఈరన్న, సుబ్బయ్య, ఎస్ఐ ధరణీబాబు, కాటమయ్య పెద్దారెడ్డి ఇంటివద్దకు వెళ్లి ఆయనతో మాట్లాడి మున్సిపల్ అధికారులతో కలిసి గేటు మూసివేయించారు. దీంతో సమస్య సద్దుమణిగింది. జేసీపీఆర్, కేతిరెడ్డి వర్గాలు మోహరించి ఉండటంతో తాడిపత్రిలో ఎప్పుడు ఏమి జరుగుతుందోననే ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పట్టణంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్ తన సిబ్బందిని ఆదేశించారు.

కాలేజీలు కాదు.. వైసీపీ కార్యాలయాలు కట్టించారు

- జగన్‌పై టీడీపీ నేతల మండిపాటు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు, మాజీ సీఎం జగన్ మెడికల్ కాలేజీలను గాలికొదిలేసి, వైసీపీ కార్యాలయాలు పూర్తి చేశారని టీడీపీ నాయకులు విమర్శించారు. అర్బన్ కార్యాలయంలో ఏపీ పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహ, నేత కడియాల కొండన్న, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే లక్ష్మీనరసింహ మీడియాలో మాట్లాడారు. 17 వైద్య కళాశాలలు తీసుకొచ్చామని గొప్పలు చెబుతున్న వైసీపీ నాయకులు వాటి నిర్మాణం ఎంతవరకూ వచ్చిందో వెల్లడించాలని ప్రశ్నించారు. 'ఐదేళ్ల పాలనలో ఒక్క కాలేజీ నిర్మాణమైనా పూర్తి చేశారా..? ఒక్క ఎంబీబీఎస్ సీటు అయినా భర్తీ చేశారా..?' అంటూ ఎద్దేవా చేశారు. నిధులు మళ్లించి వైద్య విద్యార్థుల ఆశలు అడియాసలు చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుకొండ వైద్య కళాశాల వద్ద వైసీపీ యువజన విభాగం నాయకులు ధర్నాకు పూనుకోవడం ఎంత వరకు సమంజసం అంటూ ప్రశ్నించారు. కాలేజీలు ఎందుకు కట్టలేదో ముందుగా... ప్రజలకు చెప్పాలంటూ వారు నిలదీశారు. వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో 31వ డివిజన్ ఇన్‌చార్జి సాకే జయప్ప, టీడీపీ బీసీ సెల్ జిల్లా నాయకులు రామలింగ, ఫణీంద్ర, హరి, జానపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు

నెలలోపే బిల్లులు అప్‌లోడ్ చేయాలి

- రహదారుల పనులు త్వరగా పూర్తి చేయండి
- కలెక్టర్ ఆనంద్ ఆదేశం



అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల పనులు పూర్తయ్యాక బిల్లులు నెలలోపు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలనీ, నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎంఎస్ఐడీసీ, సమగ్రశిక్ష, హౌసింగ్, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న వివిధ రకాల పనుల్లో సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు పూర్తయ్యాక నెల రోజులకు ఒక్క బిల్లు కూడా పెండింగ్ ఉండటానికి వీలు లేదన్నారు. నెలకోసారి ఇంజనీరింగ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. వచ్చే నెలకు సంబంధించి ఆర్‌అండ్‌బీ పరిధిలో లక్ష్యం నిర్దేశించుకుని రహదారుల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎంశ్రీ పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్‌ప్లాన్ తయారు చేయాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ సురేష్, పీఆర్ ఎస్‌ఈ సుబ్బరాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, ఎన్‌హెచ్ పీడీ తరుణ్, పబ్లిక్ హెల్త్ ఈఈ ఆదినారాయణ పాల్గొన్నారు.

పథకాలు పేదలకు చేరాలి

- కలెక్టర్ ఆనంద్

● ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ చేరేలా చూడాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సంక్షేమ, విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్‌తో అధికారులకు దిశా నిర్దేశం చేశారు. బడి ఈడు పిల్లలు అందరూ బడిలో ఉండేలా చూడాలని ఆదేశించారు. పోషన్ అభియాన్ లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. భూమి కోసం దరఖాస్తు చేసుకున్న 35 మంది మాజీ సైనికులకు అర్హత మేరకు సాగు భూమి పట్టాలు ఇస్తామని తెలిపారు. మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల వివరాలు తెలపాలని సూచించారు. ఆర్‌ఓ ప్లాంట్లనే మరమ్మతు చేయించాలని సూచించారు. పీఎంశ్రీ అమలు కోసం 44 పాఠశాలల మాస్టర్ ప్లాన్ సత్వరమే తయారు చేయాలని ఆదేశించారు. మరమ్మతులు చేయాల్సిన, శిథిలావస్థలో ఉన్న పాఠశాలల గదుల్లో తరగతులు నిర్వహించవద్దని హెచ్చరించారు. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు.

● పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో పాల్ ట్యాబ్‌ల వినియోగ సమయం ఎక్కువగా ఉండేలా చూడాలని, తద్వారా విజ్ఞానం పెరుగుతుందని అన్నారు. పోషకాహార లోపంతో ఉన్న మాల్ న్యూట్రిషన్ పిల్లలు, బరువు తక్కువ గల పిల్లల వివరాలు, వారికి అందిస్తున్న సపోర్ట్, తీసుకోవాల్సిన చర్యలు, ప్రోగ్రెస్ గురించి నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. సమీక్షలో డీఈఓ ప్రసాద్ బాబు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జిల్లా బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారిణి కుష్బూకొఠారి తదితరులు పాల్గొన్నారు.

దానిమ్మ ధర నేలచూపులు

టన్ను రూ.60వేలలోపే
ఈ రేటుతో పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు
ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు బాగా రావడమే కారణం
6

జూదాను వేధించిన యువకుడి అరెస్టు


(మెయిన్‌లో..)

వేరే ఎరువు కొంటేనే యూరియా..!

- అంటగడుతున్న ప్రైవేటు డీలర్లు
- లబోదిబోమంటున్న అన్నదాతలు


రైతు సేవా కేంద్రం వద్ద రైతుల పడిగాపులు

విడపనకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): యూరియా కావాలా నాయనా..? అయితే మరో ఎరువు కొంటే ఇస్తామంటూ ప్రైవేటు డీలర్లు రైతులకు బలవంతంగా ఇతర ఎరువులు అంటగడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో కొందరు కొంటున్నారు. విడపనకల్లులోని ఓ ఫర్టిలైజర్ షాపులో మూడు రోజుల కిందట ఇదే గ్రామానికి చెందిన ఆసుపత్రి లింగన్న అనే రైతు ప్రైవేటు డీలరు వద్ద రెండు బస్తాల యూరియా కొనేందుకు వెళ్లాడు. యూరియా కావాలంటే నేను ఇచ్చే ఇతర ఎరువులు కూడా తీసుకోవాలని ఆ షాపు యజమాని రైతుపై ఒత్తిడి పెంచాడు. గత్యంతరం లేక ఆషాపు నుంచి రెండు యూరియా బస్తాలతో పాటు రెండు బకెట్లలో ఇతర ఎరువులు రైతు కొన్నాడు. దీంతో మొత్తం బిల్లు రూ.2700 చేసి పంపాడు. రెండు యూరియా బస్తాలు తీసుకుంటే రూ.750 అవుతుంది. అలాంటిది ఇతర ఎరువులు అంటగట్టి రూ. 2వేలు అదనంగా ఖర్చు చేయించారని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఎలాంటి బిల్లు ఇవ్వకుండా, ఏ ఎరువుకు ఎంత రేటు వేశారనే విషయం కూడా తెలపకుండా రూ.2700 తీసుకున్నట్లు రైతు వాపోయాడు. ప్రైవేటు డీలర్లు వద్ద యూరియా ఉన్నా రైతులకు ఇవ్వటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఏఓ పెన్నయ్యను వివరణ కోరగా విడపనకల్లు గ్రామానికి మాత్రమే 12 టన్నుల యూరియా వచ్చిందని తెలిపారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రతీ రైతుకు రెండు బస్తాలు తప్పకుండా ఇస్తామన్నారు. రైతును కలిసి, ప్రైవేటు డీలరు ఎవరు అనేది విచారించి, యూరియా ఇవ్వని డీలర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


యూరియా కోసం రైతుల ఆందోళన

యూరియా కోసం మండల కేంద్రంలో రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. విడపనకల్లుకు 12 టన్నుల యూరియా వచ్చింది. దీన్ని మండల కేంద్రంలోని రైతులకు శుక్రవారం పంపిణీ చేశారు. అయితే వచ్చిన యూరియా మధ్యాహ్నానికే అయిపోయింది. దీంతో వ్యవసాయ అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. పలుకుబడి ఉన్న వారికే యూరియా ఇస్తున్నారని, సామాన్య రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల అరుపులు వినలేక వ్యవసాయ శాఖ సిబ్బంది రైతు సేవా కేంద్రానికి తాళం వేసుకుని వెళ్లి పోయారు. యూరియా దొరకని వందలాది రైతులు శాపనార్థాలు పెట్టుకుంటూ వెళ్లిపోయారు.

డెంగీతో విద్యార్థిని మృతి


ఉత్ప్రేక్ష (ఫైల్)

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల కోట వీధిలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న ఉత్ప్రేక్ష(9) డెంగీ లక్షణాలతో శుక్రవారం మృతిచెందింది. నరసింహులు కుమార్తె ఉత్ప్రేక్ష కొనకొండ్లలోని వారి అమ్మమ్మ ఇంట్లో ఉండి, చదువుకునేది. ఈ 14న జ్వరం రావడంతో పలు ఆసుపత్రిలో చూపించారు. జ్వరం తగ్గకపోవడంతో అనంతపురం ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. వైద్య ఆరోగ్య సిబ్బంది విషయం తెలుసుకుని హుటాహుటిన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు.



పుట్టపర్తిలో పొంగిపొర్లుతున్న చెక్ డ్యాం



పరగోడు డ్యాం నిండి పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

చిత్రావతి చిందులు..!

కర్ణాటకలో భారీ వర్షం

పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

- పొంగిపొర్లుతున్న పరగోడు డ్యాం
- పుట్టపర్తిలో చెక్ డ్యాంపై నుంచి నీరు
- తనకల్లు మండలంలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహించిన వంకలు
- జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు

చిలమత్తూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో చిత్రావతి నది పరవళ్లు తొక్కుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి నదీ ప్రవాహం ఉధృతమైంది. దీంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. కర్ణాటకలోని నంది కొండల్లో నుంచి వచ్చే చిత్రావతి చిలమత్తూరు, గోరంట్ల మండలాల మీదుగా పుట్టపర్తికి చేరుకుంటుంది. నదిపై కర్ణాటకలోని బాగేపల్లి సమీపంలోని పరగోడు వద్ద కట్టిన డ్యాం పూర్తిగా నిండిపోయి, పొంగిపొర్లుతోంది. ప్రవాహం గంటగంటకు పెరగడంతో పరివాహక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. చిలమత్తూరు మండలంలో కొడికొండ, మధురేపల్లి, సుబ్బరావుపేట, బూదిలి గ్రామాల వద్ద ఉన్న వంతెనలపై ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొంతకాలంలగా వర్షాభావంతో నిరాశ చెందిన రైతులు నాలుగురోజులుగా పడుతున్న వానలతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఉన్న మరోనది కుషావతి కూడా పారుతోంది. నదికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తమయ్యారు. ఈ నది ద్వారా చిలమత్తూరు, కోడూరు చెరువులకు పెద్దఎత్తున నీరు చేరుతోంది. చిత్రావతి, కుషావతి నదులు ఉధృతంగా పారుతున్న నేపథ్యంలో రాత్రి సమయాల్లో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాత్రి సమయాల్లో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఏ సమయంలోనైనా నీటి మట్టాలు పెరగవచ్చని చెబుతున్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పొంగిపొర్లిన చెక్ డ్యాం

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి): చిత్రావతి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పుట్టపర్తిలోని చెక్‌డ్యాం పూర్తిగా నిండిపోయి, పొంగిపొర్లుతోంది. సత్యసాయి శతజయంతి వేడుకల వేల నదికి నీరు రావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పుణ్యస్నానాలకు ఇబ్బందులు ఉండవని పేర్కొంటున్నారు. భూగర్భ జలాలు పెరిగి, తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని స్థానికులు చెబుతున్నారు. చిత్రావతికి వరద పెరుగుతోందనీ, లోతట్టుప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి సూచించారు. గ్రామాల్లో దండోరా వేయించాలని సిబ్బందిని ఆదేశించారు.

భారీ వర్షం

తనకల్లు (ఆంధ్రజ్యోతి): మండలంలోనిమార్పురివాండ్లపల్లి, రాగినేపల్లి, కురమాలపల్లి, పెద్దఎద్దులవారిపల్లి, బొంతపల్లి, ఎర్రగుంటపల్లి, చీకటిమానుపల్లి, తదితర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. కుంటలు, చెరువులు, వంకలు, వాగులు, చెక్ డ్యామ్‌లు పూర్తిగా నిండి, పొంగిపొర్లాయి. పది రోజులుగా పెద్ద ఎద్దువారిపల్లి చెరువుకు హంద్రీనీవా నీటిని వదులుతుండగా.. వర్షపు నీరు తోడవడంతో పూర్తిగా నిండింది. పైనున్న చెరువులన్నీ నిండి పొంగి పొర్లడంతోపాటు వర్షం ఎక్కువగా కురవడంతో పెద్ద ఎద్దులవారిపల్లి చెరువు మరువ పారింది. కురమాలపల్లి వద్ద హంద్రీనీవా కాలువ నీటికి వర్షపునీరు తోడవడంతో ప్రవాహం పెరిగింది. దీంతో రోడ్లు కోతకు గురయ్యాయి. ఒక్కసారిగా నీరు అంతా రావడంతో చీకటిమానుపల్లి వద్ద శుక్రవారం ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు జాతీయ రహదారి నీటితో నిండిపోయింది. రాకపోకలు స్తంభించాయి. దీంతో ఈదులవంక నుంచి రెండు కిలోమీటర్లపైగా వాహనాలు ఆగిపోయాయి. వంకకు అటు వైపు అన్నమయ్య జిల్లాలోని మొలకల చెరువు వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ప్రయాణికులు, తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈదుల వంక ఉధృతి తగ్గగానే యువకులు దగ్గరుండి వాహనాలను దాటింపజేశారు. ఒక్కరాత్రిలోనే చెరువులన్నీ నిండిపోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న ఈదులవంక



రోడ్డుకి ఇరువైపులా ఆగిన వాహనాలు



సుబ్బరావుపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న చిత్రావతి నది

జీఎస్టీ ఎఫెక్ట్ !

- ముందుకు సాగని చెరువుల మరమ్మతులు
- జిల్లాకు రూ.రెండు కోట్లు మంజూరు
- 168 చెరువులకు 30చెరువుల్లో పనులు ప్రారంభం
- జీఎస్టీ నిబంధనతో ముందుకురాని సాగునీటి సంఘం సభ్యులు



వెంగళమ్మచెరువులో మరమ్మతు పనులు జరుగుతున్న దృశ్యం

మడకశిర, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చెరువుల మరమ్మతులపై జీఎస్టీ లైసెన్స్ ఎఫెక్టు తీవ్రంగా పడుతోంది. జీఎస్టీ లైసెన్స్ ఉన్న సాగునీటి సంఘం వారే మరమ్మతులు చేయాలని ప్రభుత్వ నిబంధనలతో ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా 168 చెరువులకు మరమ్మతు పనులు చేయాలని ప్రభుత్వం భావించగా కేవలం 30 చెరువుల్లోనే పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు 8 చెరువుల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక జిల్లాలో చెరువుల మరమ్మతులపై దృష్టి సారించింది. ఈక్రమంలోనే జిల్లాకు తొలి విడతగా రూ. రెండు కోట్లు మంజూరు చేశారు. ఇందులో ఒక్కో చెరువుకు రూ.60 వేలు మొదలుకుని రూ.నాలుగు లక్షల దాకా నిధులు మంజూరు చేశారు. అయితే జీఎస్టీ నిబంధనతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడలేదు. పెనుకొండ డివిజన్ పరిధిలో 95 చెరువులకు గాను 25 చెరువులకు టెండర్లు పిలిచారు. 14 చోట్ల పనులు జరుగుతున్నాయి. ధర్మవరం డివిజన్‌లో 73 చెరువులకు రూ.99 లక్షలు మంజూరయ్యాయి. ఇందులో 44 చెరువులకు టెండర్లు పిలిచారు. 17 చెరువులకు టెండర్లు పిలవాల్సి ఉంది. సాగునీటి సంఘం అధ్యక్షులు ఇప్పటికే 16 చెరువుల మరమ్మతు పనులు చేపట్టారు. ఇందులో 7 చెరువుల పనులు పూర్తి అయ్యాయి. ఆయకట్టు సంఘాలు లేని చోట టెండర్లు పిలిచి పనులు చేయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలైన తల్లికి వందనం, రేషన్‌కార్డు వంటి పథకాలు కోల్పోతామనే ఆందోళనతో చాలామంది ఆయకట్టు సంఘం సభ్యులు జీఎస్టీ లైసెన్స్ తీసుకోవడానికి ముందుకు రావడం లేదని సమచారం.

ఏడు చెరువులకు రూ.17లక్షలు



అమరాపురం మండలంలో ఏడు చెరువులకు రూ.17 లక్షలు మంజూరయ్యాయి. జీఎస్టీ లేకుండా పనులు చేపట్టేందుకు అనుమంతించాలని సంబ ంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లాం. చెరువు కట్టల మీద కంపచెట్లు తొలగించడం, తూముల మరమ్మతులు చేయడం ఈ వర్షాకాలంలో కష్టమని, డిసెంబరు లేదా జనవరిలో పనులు చేపట్టడానికి అనుమతించాలని అధికారులను కోరాం.

- గురుసిద్ధప్ప, చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు, అమరాపురం

జిల్లాకు రూ.రెండు కోట్లు: గురుమూర్తి, సురేందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఈలు

శ్రీసత్యసాయి జిల్లాలో చెరువుల అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. జిల్లా లో 168 పనులకు 30 చోట్ల పనులు జరుగుతున్నాయి. ఇందులో పెనుకొండ డివిజన్‌లో 95 చెరువులకు నిధులు మంజూరయ్యాయి. 14 చోట్ల పనులు పనులు ప్రారంభించారు. ఇందులో 25 చెరువులకు టెండర్లు పిలిచాం. ధర్మవరం డివిజన్‌లో 73 చెరువులకు నిధులు మంజూరయ్యాయి. ఇందులో 17 చెరువులకు టెండర్లు పిలిచాం. 16 చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. ఏడు చోట్ల చెరువుల మరమ్మమతు పనులు పూర్తయ్యాయి.

చలో మెడికల్ కాలేజీకి స్పందన కరువు

- సెల్ఫీలతో సరిపెట్టిన వైసీపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): 'చలో మెడికల్ కాలేజీ' పేరిట వైసీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమంలో 'సెల్ఫీ విత్ మెడికల్ కాలేజీ' అన్నట్లు తయారైంది. పిల్లర్ల నడుమ నిలబడి మెడికల్ కాలేజీ భవంతిని నిర్మించినట్లు నాయకకులు ఫొటోలు దిగారు. వైసీపీ అధినేత జగన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలు కొందరు పెనుకొండ మెడికల్ కళాశాల భవనం నిర్మిస్తున్న ప్రాంతానికి వెళ్లారు. వైసీపీ విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పార్టీ రెండు జిల్లాల అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉష శ్రీచరణ్, మాజీ ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి తదితరులు ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలలపై కక్ష కట్టిందని ఆరోపించారు. పెనుకొండ వద్ద భవనాలు నిర్మించినా, ఏమీ లేవని మంత్రి సవిత చెప్పడం సిగ్గుచేటని అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వైసీపీ అడ్డుకుంటుందని స్పష్టం చేశారు. ఉష శ్రీచరణ్ ప్రసంగిస్తున్న సమయంలో ఓ కార్యకర్త 'నరుకుతాం' అంటూ కేకలు వేశాడు.



పెనుకొండ మెడికల్ కళాశాల వద్ద వైసీపీ నాయకులు, కార్యకర్తలు

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్



అనంతపురంలో నిరసన తెలుపుతున్న డాక్యుమెంట్ రైటర్లు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో 2.0 విధానంలో తలెత్తుతున్న సమస్యలపై డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్ నిరసన నిర్వహించారు. దీంతో ఉమ్మడి జిల్లాలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్లు మాత్రమే పూర్తయ్యాయి. సబ్‌రిజిస్ట్రార్లు, ఇతర సిబ్బంది పెండింగ్ పనులు చేసుకున్నారు. స్టాంపులు, ఈసీలు, నకల్లు ఇతర వాటికి మాత్రమే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. అనంతపురంలోని రామ్‌నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో -1, రూరల్ కార్యాలయంలో-4తో కలిపి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 15వరకు, శ్రీ సత్యసాయి జిల్లాలో 10 మొత్తం 21 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 25 డాక్యుమెంట్లు జరిగాయి. డాక్యుమెంట్ రైటర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ కొత్త విధానంలో రిజిస్ట్రేషన్ సమయంలో క్రయ, విక్రయదారులు ఓటీపీ చెప్పాల్సి వస్తోందని, కానీ మొబైల్‌ఫోన్లు లేని వారికి ఇబ్బందిగా ఉందన్నారు. ఎనీవేర్ విధానంలో గంటలో డాక్యుమెంట్ సబ్‌మిట్ చేసుకుంటే ఇదివరకు గంట సమయంలో ఓకే లేదా రిజెక్ట్ చేసే విధంగా ఉండేదన్నారు. కానీ ఇప్పుడు 48గంటలకు గడువు పెంచారని, దీంతో అక్కడి వారికి తీవ్ర సమస్యగా ఉందన్నారు. పెన్‌డౌన్ శనివారం కూడా కొనసాగిస్తామన్నారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

2.362 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని కమలపాడులో ఈ నెల 14న జరిగిన చోరీ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. నిందితులు ద్విచక్ర వాహనాల్లో స్టీలు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మే వారిలా గ్రామంలో రెక్కీ నిర్వహించారు. తాళాలు వేసిన రెండు ఇళ్లను లక్ష్యంగా చేసుకుని వాటిలో చొరబడి వెండి వస్తువులు, డబ్బులు ఎత్తుకెళ్లారన్నారు. ఈ కేసులో నిందితుల నుంచి 2362గ్రాముల వెండి ఆభరణాలు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులైన ప్రకాశం జిల్లా కనిగిరి మండలం భూతంవారి గ్రామానికి చెందిన అంజయ్య, ఏసురత్నం, కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మద్దిమడుగుకు చెందిన హనుమంతును కొనకొండ్ల సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

వచ్చేసింది.. సెలవుల పండుగ

(5వ పేజీ తరువాయి)



పట్టించుకోలేదు. చివరకు టీడీపీ ఎమ్మెల్సీలు.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి సెలవులు వ్యవహారం తీసుకెళ్లారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈనెల 22వ తేదీ నుంచే దసరా సెలవులు ఉంటాయని ప్రకటిస్తూ ట్వీట్ చేశారు. ఆ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా సెలవులు ఉంటాయని వెల్లడించారు. శనివారం కాంప్లెక్స్ సమావేశాలు యథాతథంగా కొనసాగించాలనీ, ఉదయం స్కూల్‌కు వెళ్లి మధ్యాహ్నం కాంప్లెక్స్ సమావేశాలకు ప్రతి టీచర్ హాజరుకావాలని ఆదేశాలు ఇచ్చారు. ఆదివారం ఎలాగూ సెలవు ఉంటుంది. సోమవారం నుంచి వచ్చేనెల 2వతేదీ వరకు దసరా సెలవులు ప్రకటించారు. అక్టోబరు 3వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని విద్యాశాఖ అధికారవర్గాలు తెలిపాయి. మొత్తంమీద దసరా సెలవులపై మంత్రి లోకేశ్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపడంపట్ల ఉపాధ్యాయ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

దానిమ్మ ధర నేలచూపులు

- టన్ను రూ.60వేలలోపే..
- ఈ రేటుతో పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు
- ఇతర రాష్ట్రాల్లో దిగుబడులు బాగా రావడమే కారణం



ఏపుగా కాసిన దానిమ్మకాయలు

పుట్లూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దానిమ్మ ధరలు నేలచూపులు చూస్తున్నాయి. నానాటికీ తగ్గుతున్నాయి. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నెలరోజుల క్రితం ఉన్న ధరలు అమాంతం తగ్గి సగానికి పడిపోతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కనీసం పెట్టుబడులైనా వస్తావా.. రావా.. అన్న ఆందోళనలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే దానిమ్మ ధరలు సగం పైగానే తగ్గిపోయాయి. పుట్లూరు, పెద్దపప్పూరు, యల్లనూరు, యాడికి, తాడిపత్రి, నార్పల తదితర మండలాల్లో దానిమ్మ ఎక్కువగా సాగు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 13,381 ఎకరాల్లో పంట పెట్టారు. గతంలో ధరలు ఎక్కువగా ఉండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ఈ ఏడాది ధరలు తగ్గుముఖం పట్టడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

టన్ను 60వేలలోపే..

ఎకరాలో దానిమ్మ సాగుకు రూ.80 వేల నుంచి లక్ష వరకు పెట్టుబడి పెట్టినట్లు చెబుతున్నారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. టన్ను ధర ప్రస్తుతం 60వేలలోపే పలుకుతోంది. మూడు నెలల నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సరిగ్గా ఏడాది క్రితం దానిమ్మ టన్ను ధర రూ.1.20 లక్షలు పలికి రైతులకు సిరులు కురిపించింది. ఈసారి కూడా ధరలు బాగుంటాయనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. ఇతర రాష్ట్రాల్లో పంట దిగుబడి ఎక్కువగా ఉండడంతో ఏపీలో ధరలు తగ్గుముఖం పట్టాయని వ్యాపారులు చెబుతున్నారు. నవంబరు నుంచైనా ధరలు పెరుగకపోతాయా అన్న ఆశతో రైతులు ఉన్నారు. అప్పుడు కూడా ధరలు పెరగకపోతే నష్టాలు తప్పవని వాపోతున్నారు. పంటను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, చెన్నై తదితర ప్రాంతాలకు ఎగుమతి చేసేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో పంట ఎక్కువగా వస్తుండడంతో తెలంగాణ, చెన్నైకి నామమాత్రంగా ఎగుమతి చేస్తున్నారు.



వాహనంలో తరలించడానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు



దానిమ్మ ధరలు ఇలాగే కొనసాగితే పెట్టుబడులు కూడా రావు. ఎకరాకి పెట్టుబడి రూ.80వేల నుంచి లక్ష వరకు వచ్చింది. దిగుబడి బాగున్నా.. ధరలు తగ్గడం కలవరపెడుతోంది. నాలుగెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రానున్న నెలల్లో అయినా ధరలు పెరిగితే కొంత ఉపశమనం దక్కుతుంది.

- వెంకటనారాయణ, వరదాయపల్లి

ఈ ధరలతో నష్టమే..



దానిమ్మ ధరలు తగ్గడంతో పంటను అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నాం. కొన్నిచోట్ల పంట కోత దశకు రావడంతో నష్టానికే విక్రయించాల్సి వస్తోంది. ఏడెకరాల్లో పంట సాగుచేశా. పంటలో సస్యరక్షణ చర్యలు తప్పకుండా చేపట్టాల్సి ఉంటుంది. లేకపోతే దానిమ్మ కాయలు దెబ్బతిని మొదటికే మోసం వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు తక్కువ ధరకే అడుగుతున్నారు.

- శివశంకర్ రెడ్డి, కందికాపుల

వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు



చంద్రాయుడు

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో వాతావరణ పరిస్థితుల కారణంగా పలు పంటల్లో సస్యరక్షణ చర్యలు వెంటనే చేపట్టాలని కళ్యాణదుర్గం కేవీకే ప్రధాన శాస్త్రవేత్త చంద్రాయుడు శుక్రవారం ప్రకటనలో సూచించారు. కొన్ని రోజులుగా కురుస్తున్న వరుస వర్షాలతో భూమిలో తేమ ఎక్కువై, పలు రకాల పంటలను తెగుళ్లు ఆశించాయన్నారు. వెంటనే సస్యరక్షణ చేపట్టాలనీ, ఆలస్యంచేస్తే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు. ఆయన తెలిపిన సూచనలు.

పంటలు, తెగుళ్లు, నివారణ వివరాలు..

- 90 రోజుల వయసున్న వేరుశనగ పంటలో ఆకుమాడు, వేరుకుళ్లు, బూడిద రోగం 20 నుంచి 40 శాతందాకా ఉంది. వీటి నివారణ కోసం ఎకరాకు 250 గ్రాముల సాఫ్‌ను వేర్ల వద్ద తడిసేలా పిచికారీ చేసుకోవాలి.
- ఆముదం పంట పూత, గెల ప్రారంభ దశలో ఉంది. వేరుకుళ్లు, నామాల పురుగు, కాయకుళ్లు 15 నుంచి 30 శాతం వరకు ఆశించాయి. ఎకరాకు 250 గ్రాముల సాఫ్, 80 గ్రాముల ప్రొక్లేమ్‌ను పిచికారీ చేసుకోవాలి.
- కంది పంట శాకీయ, పూత దశలో ఉంది. ఎండు తెగులు, వెర్రి తెగులు, లద్దె పురుగులు ఆశించాయి. నివారణ కోసం 250 గ్రాముల సాఫ్, 80 మి.లీ. కొరాజన్‌ను పిచికారీ చేసుకోవాలి.
- మొక్కజొన్నను కత్తెర పురుగు, ఆకుమాడు తెగులు ఆశించాయి. వీటి నివారణ కోసం ఎకరాకు 80 మి.లీ కొరాజన్, 250 గ్రాముల సాఫ్‌ను పిచికారీ చేసుకోవాలి.
- చిరుధాన్య పంటల్లో లద్దె పురుగు, తెగుళ్ల నివారణ కోసం ఎకరాకు 80 గ్రాముల ప్రోక్లేమ్, 250 గ్రాముల సాఫ్‌ను స్ప్రే చేసుకోవాలి.
- కంది, ఆముదం, మొక్కజొన్న, చిరుధాన్యాల పంటలపై ఎకరాకు మల్టీ కే 10కిలోలను పైపాటుగా పిచికారీ చేసుకోవాలి.

23న మడకశిరలో మెగా జాబ్‌మేళా

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, నాయకులు

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మడకశిరలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన మెగా జాబ్‌మేళా పోస్టర్లను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 11 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ, తేజ్ కుమార్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొట్టిన లారీ.. ఇద్దరు యువకుల మృతి



ప్రమాదానికి కారణమైన లారీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం పాములరాయి సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అనంతపురం నగరంలోని వినాయకనగర్‌కు చెందిన ముత్తుం బాషా(23), కుమార్ కార్తీక్ (20) అక్కడికక్కడే మృతిచెందారు. ఇద్దరూ టైల్స్ వర్క్ చేస్తూ జీవనం సాగించేవారు. పాములరాయి సమీపంలో ఓ వెంచర్‌లో పని ముగించుకుని, బైక్‌పై అనంతపురానికి తిరిగి వస్తుండగా కర్నూలు నుంచి బెంగళూరు వైపు వెళ్తున్న గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొట్టింది. లారీ అధిక వేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీ ఢీకొట్టింది. బైక్ హ్యాండిల్ లారీకి ఇరుక్కోవడంతో ఇద్దరు యువకులు అదుపు తప్పి లారీ చక్రాల కింద పడ్డారు. దీంతో శరీర అవయవాలు నుజ్జునుజ్జయ్యాయి. ముత్తుం బాషాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్ కార్తీక్ అవివాహితుడు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

యాడికి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువు వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ సయ్యద్‌వలి (35) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు గ్రామానికి చెందిన షేక్ సయ్యద్‌వలి నైటీల వ్యాపారం చేసుకుంటూ జీవించేవాడు. వ్యాపార పనులు ముగించుకొని ఇంటికి వెళుతున్న సమయంలో ముందువైపు వెళుతున్న లారీని ద్విచక్రవాహనంలో వేగంగా వెళ్లి ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని తాడిపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య రబియా, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రిన్సిపాల్‌పై విద్యార్థి దాడి



విచారణ చేస్తున్న డీఎస్పీ రవిబాబు, డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు

శెట్టూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి ప్రిన్సిపాల్ శ్రీరాములుపై శుక్రవారం దాడి చేశాడు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలిపిన మేరకు.. బెల్టు, షూ వేసుకురాని పదో తరగతి విద్యార్థిని ప్రార్థనా సమయంలో ప్రిన్సిపాల్ మందలించాడు. దీన్ని అవమానంగా భావించిన విద్యార్థి అందరి సమక్షంలోనే ప్రిన్సిపాల్ చొక్కా పట్టుకుని దాడికి పాల్పడ్డాడు. ఉపాధ్యాయులు కలుగజేసుకుని దాడి నుంచి ప్రిన్సిపాల్‌ను కాపాడారు. జరిగిన విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు, కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను సమావేశపరిచి దాడి గల కారణాలను ఆరతీశారు. ఉన్నతాధికారులతో చర్చించి ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయిస్తామని డిప్యూటీ డీఈఓ శ్రీనివాసులు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిలే దీక్షలు చేస్తున్న జేఏసీ నేతలు, ఉద్యోగులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టారు. జేఏసీ నేతలు మాట్లాడుతూ.. నాలుగైదేళ్లుగా విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మిక సంఘాలు గతంలో ఉద్యమాల ద్వారా సాధించుకున్న ప్రయోజనాలను ఉపసంహరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తున్నారన్నారు. ఆరు దశాబ్దాల నుంచి అమలులో ఉన్న సర్వీస్ నిబంధనలను ఏకపక్షంగా మార్పులు చేస్తున్నారన్నారు. వెంటనే ఈ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నేతలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరిధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 262టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పశువులకు ఉచిత చికిత్స శిబిరం

● జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి వెంకటేష్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వాహక అధికారి వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూడేరు మండలం కమ్మూరులో శనివారం ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఈనెల 23న ఆత్మకూరు మండలం సిద్దరాంపురం, 27న బుక్కరాయసముద్రం మండలం కొట్టాలపల్లి, 30న గుత్తి మండలం తొండపాడులో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● రూ. 35 లక్షల నగలు, బైకులు స్వాధీనం
● జల్సాల కోసం చైన్‌స్నాచింగ్‌లు, నోట్ల ముద్రణ
● చెడు సావాసంతో కటకటాల్లోకి కాబోయే డాక్టర్!

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యసనాలు ఆ ఇద్దరిని నేరస్థులుగా మార్చాయి. పాతికేళ్లు నిండకుండానే చైన్‌స్నాచింగ్, నకిలీ కరెన్సీ వంటి నేరాలు చేయడంలో ఆరితేరారు. ఇందులో ఒకరు రష్యా వెళ్లి ఎంబీబీఎస్ చేయాల్సి ఉండగా చెడు సావాసంతో కటకటాల పాలయ్యాడు. చైన్ స్నాచింగ్, నకిలీ నోట్ల తయారీకి పాల్పడుతున్న ఇద్దరు అంతరాష్ట్ర దొంగలను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచీ రూ.35 లక్షల బంగారం ఆభరణాలు, నగదు, నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జగదీష్ శుక్రవారం విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. కంబదూరులోని పాత ఎస్సీ కాలనీకి చెందిన 25 ఏళ్ల జశ్వంత్ అలియాస్ జశ్వంత్ రాజు, కంబదూరులోని ఆర్డీటీ కాలనీకి చెందిన 21 ఏళ్ల కంబదూరు భోగం రాజు అలియాస్ షాలేము రాజు బంధువులు, స్నేహితులు. జశ్వంత్ పెద్దగా చదువుకోలేదు. కర్ణాటక తదితర ప్రాంతాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడేవాడు. ఆయనపై కర్ణాటకలో ఆరు కేసులు ఉన్నాయి. నాలుగేళ్లుగా కర్ణాటకలోని పావగడ, కళ్యాణదుర్గం, కంబదూరు ప్రాంతాల్లో వాహనాల చోరీ, ఇళ్లలో దొంగతనాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డాడు. 2021లో పావగడలో 2 కేసులు, వైఎన్ హొసకోటలో ఒకటి, 2023లో కళ్యాణదుర్గంలో ఒకటి, 2004లో కంబదూరు స్టేషన్ రెండు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తన ఫ్రెండ్ భోగం రాజును సైతం అటువైపు మళ్లించాడు. అతడితో కలిసి నేరాలకు పాల్పడ్డాడు.

ఎంబీబీఎస్ కోసం రష్యా వెళ్లాలని...

భోగం రాజు వచ్చే నెలలో ఎంబీబీఎస్ చదవడం కోసం రష్యా వెళ్లాల్సి ఉంది. జశ్వంత్‌తో ఉన్న స్నేహం వల్ల అతడు జల్సాలకు పెట్టే ఖర్చులు చూసి భోగం రాజు కూడా అతడి మాయలో పడ్డాడు. సులభంగా వచ్చే డబ్బుతో జల్సాలు చేసేవారు. ఇద్దరూ రెండేళ్లుగా నేరాల్లో పాల్గొంటూ వచ్చారు. ద్విచక్రవాహనాన్ని ఒకరు వేగంగా నడిపితే, మరొకరు మహిళల మెడలో బంగారు చైన్లు లాగేసేవాడు. అనంతపురం, పుట్లూరు,



స్వాధీనం చేసుకున్న నగదు, నగలను చూపుతున్న ఎస్పీ జగదీష్

నార్పల, ఉరవకొండ, తాడిపత్రి, కడప జిల్లా సింహాద్రిపురం మండలం తదితర ప్రాంతాల్లో ఒంటరిగా వెళ్లే మహిళను టార్గెట్ చేసుకుని చైన్లు లాక్కెళ్లేవారు. దొంగిలించిన బంగారు నగలను విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసుకునేవాళ్లు. ఇద్దరిపై రెండేళ్లలో 12 కేసులు నమోదయ్యాయి. అనంతపురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, నార్పలలో-2, ఉరవకొండలో-1, తాడిపత్రిలో-3, తాడిపత్రి రూరల్-1, అనంతపురం రూరల్-1, పుట్లూరులో 2, కడప జిల్లా సింహాద్రిపురంలో ఒక కేసు నమోదైంది. నకిలీ కరెన్సీ కూడా ముద్రించి సుమారు రూ. 2 లక్షల వరకూ చలామణి చేసినట్లు సమాచారం. చైన్ స్నాచర్లపై నిఘా పెట్టిన పుట్లూరు, అనంతపురం సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈక్రమంలోనే పుట్లూరు మండలం శనగలగూడురు సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 35 లక్షల విలువైన 34 తులాల బంగారం ఆభరణాలు, రూ.35500నగదు, రూ.500 నకిలీ నోట్లు, ప్రింటర్, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదింపులో కీలకంగా వ్యవహించిన సీఐలు సత్యబాబు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు శేషగిరి, జయపాల్‌రెడ్డి, వలిబాషా, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఎస్పీ జగదీష్ ప్రశంసాపత్రాలు, రివార్డులతో అభినందించారు.

దేశ పురోగతిలో సొసైటీల పాత్ర కీలకం

● డీసీఓ అరుణకుమారి



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డీసీఓ అరుణకుమారి, చిత్రంలో ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్ చైర్మన్లు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక ప్రగతి, సమాజాభివృద్ధి, దేశ పురోగతిలో సొసైటీల పాత్ర కీలకమని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో ఈ-ప్యాక్స్ (పీఏసీఎస్)పై ఒక్కరోజు వర్క్‌షాప్ శుక్రవారం నిర్వహించా రు. ఈ సందర్భంగా డీసీఓ అరుణకుమారి మాట్లాడుతూ అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రాథమిక సహకార వ్యవసాయ సంఘాల (పీఏసీఎస్)ను బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. రైతులు, కార్మికులు, మహిళలు, చిరువ్యాపారులు పరస్పర సహకారంతో సొసైటీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశు లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సొసైటీలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. సొసైటీలు అభివృద్ధి సాధిస్తే రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. జిల్లా సహకార శాఖ డిప్యూటీ రిజిస్ట్రార్ నారాయణస్వామి, పూర్వపు డీసీఓలు ప్రభాకర్‌రెడ్డి, పుల్లప్పలు సహకార చట్టం, సొసైటీల నిబంధనలు, ఆన్‌లైన్ నిర్వహణ, ఆన్‌లైన్ ఆడిట్‌పై వివరించారు. కార్యక్రమంలో ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధికారులు రాజారెడ్డి, మురళీమోహన్, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ విజయ్‌భాస్కర్, నూతనంగా నియమితులైన సొసైటీల చైర్మన్లు, సీఈఓలు, పర్సన్ ఇంచార్జిలు, సహకార శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్టు ఎంపిక



హాజరైన క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ జట్టును శుక్రవారం ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన సెలెక్షన్స్ శుక్రవారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించారు. డీఎస్‌డీఓ మంజుల.. పోటీలను ప్రారంభించారు. బాల, బాలికల అండర్-14, 16, 18, 20 విభాగాల్లో సెలెక్షన్స్ నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ సుదర్శన్ ప్రకటించారు. లావణ్య, మహేంద్ర, సాంబశివారెడ్డి, జనశ్రీ, అమూల్య, చంద్రశేఖర్, అంజునాయక్, పవన్‌కుమార్, అరవింద్, శకుంతల, హేమంత్‌రాజ్, మంజునాథ్ యాదవ్, నవిత్ర, మహిత జట్టుకు ఎంపికయ్యారు. వీరు ఈనెల 27వ తేదీ నుంచి ఏలూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరిధిలో మే నెలలో నిర్వహించిన డిగ్రీ రెండు, నాలుగు సెమిస్టర్ల ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం వర్సిటీలో వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల విభాగ డైరెక్టర్ రమణ, కంట్రోలర్ శ్రీరామ్‌నాయక్ ఫలితాలు విడుదల చేశారు. రెండో సెమిస్టర్‌లో 7,760 మంది పరీక్షలు రాయగా.. 3,535 మంది ఉత్తీర్ణత సాధించారు. నాలుగో సెమిస్టర్‌లో 7,798 మంది పరీక్షలకు హాజరుకాగా.. 4,250 ఉత్తీర్ణులయ్యారు. శనివారం నుంచి ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లో విద్యార్థులు చూసుకోవచ్చని పరీక్షల విభాగ అధికారులుతెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ శంకర్, ప్రోగ్రాం ఆఫీసర్ బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

త్వరలో మరో ఆరు సొసైటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): త్వరలో జిల్లాలో ఆరు ప్రాథమిక సహకార సంఘాలు (పీఏసీఎస్) ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం 58 సొసైటీలు ఉన్న విషయం తెలిసిందే. కొత్తగా ఏడీసీసీ బ్యాంకు రాయదుర్గం బ్రాంచ్ పరిధిలో ఓబుళాపురం, సోమలాపురం, గుమ్మఘట్టలలో సొసైటీలు ఏర్పాటు చేయనున్నారు. తాడిపత్రి బ్రాంచ్ పరిధిలో నందలపాడు, గుత్తి బ్రాంచ్ పరిధిలో బసినేపల్లి, రజాపురంలలో సొసైటీలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు డీసీఓ అరుణకుమారి తెలిపారు.

నేడు అక్కినేని స్వరాభిషేకం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అక్కినేని నాగేశ్వరరావు 102వ జయంతిని పురస్కరించుకుని నగరంలో శనివారం సాయంత్రం అక్కినేని స్వరాభిషేకం నిర్వహిస్తున్నారు. అనంతనాగ్ సంగీత స్వర్గ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని కృష్ణకళా మందిర్‌లో ఈ వేడుకలను నిర్వహిస్తున్నారు. అభిమానులు, కళాకారులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు.

టమోటా కిలో రూ.24

అనంతపురంరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.24తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.14, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

టీబీ విభాగాధికారిగా జయలక్ష్మి

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని లెప్రసి, ఎయిడ్స్, టీబీ విభాగాల అధికారిగా డాక్టర్ జయలక్ష్మి నియమితులయ్యారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవిని శుక్రవారం ఆమె కలిసి విధుల్లో చేరారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

● జేడీ బసవరాజు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్న సంపన్న కుటుంబాలు పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలని రాష్ట్ర అర్థ గణాంకశాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) బసవరాజు అన్నారు. జేఎన్‌టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో శుక్రవారం జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఇదివరకే ఎంపిక చేసిన గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి పీ-4 కార్యక్రమంపై శిక్షణ ఏర్పాటు చేశారు. జేడీ బసవరాజు మాట్లాడుతూ.. పీ 4 సర్వే ద్వారా రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన వారిని గుర్తించి, వారి అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వార్డు, సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. శిక్షణ పొందిన వారందరూ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ముఖ్యప్రణాళిక శాఖ ఎస్‌ఓ గిరిధర్, తాతిరెడ్డి, నాయక్ పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

కదిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీలో ఎనిమిదేళ్ల బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పట్టణంలోని కాలనీలో ఓ పాఠశాలలో బాలిక మూడో తరగతి చదువుతోంది. పాఠశాల పక్కన అంగడికి శుక్రవారం వెళ్లింది. అంగడి పక్కన ఉన్న రోషన్‌వలి అనే వ్యక్తి తన ఇంట్లోకి బాలికను పిలిచి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రోషన్ వలిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మా ప్రాంతం.. పరిశ్రమలకు అనుకూలం

● అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు శ్రీసత్యసాయి జిల్లా అనుకూలమైన ప్రాంతమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. సభలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమి పుష్కలంగా ఉందన్నారు. నియోజకవర్గంలోని కప్పలబండ ఇండస్ట్రియల్ పార్కులో ఎన్ని పరిశ్రమలు నెలకొల్పారు? ఎంతమందికి అనుమతులు ఇచ్చారు? ఎంత భూమి మిగిలి ఉందో సంబంధితశాఖామంత్రి తెలపాలని ఎమ్మెల్యే కోరారు. పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ వర్గాలతో పాటు మహిళలకు ఎలాంటి రాయితీలు కల్పించే అవకాశం ఉందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. 2008-2009లో అమడగూరు ప్రాంతంలో రూ.లక్ష కోట్లతో 60 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేవిధంగా సైన్సుసిటీ ఏర్పాటు చేస్తామని 402 ఎకరాలు భూమిని అప్పటి ప్రభుత్వం సేకరించిందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఈప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి, పరిశ్రమలశాఖామంత్రిని ఎమ్మెల్యే కోరారు. జిల్లా బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటంతో పాటు భూముల లభ్యత, ధర చౌకగా ఉన్నట్లు వివరించారు. ఇన్ని అనుకూలతలు ఉన్న శ్రీసత్యసాయి జిల్లాలో పరిశ్రమలు ఏమైనా స్థాపించే అవకాశాలున్నాయా అని సంబంధిత మంత్రిని ప్రశ్నించారు.

విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలి: ఎస్ఈ



సమీక్షలో పాల్గొన్న ఎస్ఈ సంపత్‌కుమార్

ధర్మవరం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలను అరికట్టేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో పుట్టపర్తి డివిజన్‌లోని డీఈ, ఏఈలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాల విషయంలో పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రమాదాల నివారణపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ బిల్లుల వసూలులో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఐ గంగాధర్, ఏడీఈ లక్ష్మీనరసింహారెడ్డి, ఏఈ శివరాం, సీకేపల్లి డీఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) నిర్వహించే స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సులో చేరడానికి ఆసక్తికలవారు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ ఎస్ఎం మంజుల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సు కోచింగ్ స్పోర్ట్స్ డిప్లొమా కోర్సుతో సమానమన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు ఈనెల 25లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08554-315632, సెల్ నంబరు 7207384486లను సంప్రదించాలని కోరారు. దరఖాస్తు చేయడానికి వెబ్‌సైట్ http://www.nsis.in

జోరుగా పైరవీలు..!

● ముగిసిన వయోజన విద్య సూపర్‌వైజర్ ఇంటర్వ్యూలు
● పోస్టులు దక్కించుకునేందుకు అడ్డదారులు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్

అనంతపురంవిద్య, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖ పరిధిలో సూపర్‌వైజర్ పోస్టులు దక్కించుకునేందుకు అభ్యర్థులు జోరుగా పైరవీలు చేస్తున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉమ్మడి అనంత జిల్లా పరిధిలోని కదిరి, పెనుకొండ డివిజన్ల సూపర్‌వైజర్ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ పోస్టులకు ప్రభుత్వ టీచర్లుగా ఎస్‌జీ కేడర్‌లో దాదాపు పదేళ్ల సర్వీస్ ఉండి, 45 ఏళ్ల వయసులోపు వారు అర్హులు. ఈ పోస్టులకు 21మంది టీచర్లు దరఖాస్తులు చేసుకున్నారు. పోస్టును ఎలాగైనా దక్కించుకోవాలని విశ్వప్రయత్నాలు సాగిస్తున్నారు. కొందరు.. రాజకీయ నేతలనుంచి సిఫార్సులు చేయించగా.. మరికొందరు డబ్బు ఎరగా వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ఇద్దరు టీచర్లు తమకు ఆ పోస్టులు ఇప్పిస్తే రూ.5 లక్షలు ఇస్తామని ఆ శాఖలో పనిచేస్తున్న ఒకరితో ఒప్పందం చేసుకుని, అడ్వాన్స్‌గా రూ.3 లక్షలు కూడా ఇచ్చారంట. అందులో ఓ టీచర్ అభ్యర్థిత్వం నిబంధనల మేరకు లేకపోవడంతో తిరస్కరించారని తెలుస్తోంది. దీంతో ఆ డబ్బు వాపసు ఇచ్చారని ఉపాధ్యాయ వర్గాల్లో చర్చ సాగుతోంది. 21 మందిలో 8 దరఖాస్తులను తిరస్కరించగా.. 13 మందిని ఇంటర్వ్యూలకు అధికారులు ఆహ్వానించారు. వీరికి జిల్లా వయోజన విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ ఆధ్వర్యంలో వయోజన విద్యాశాఖ డీడీ వెంకటేశ్వర్లు, విద్యాశాఖ గుత్తి డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి తదితరులు ఈనెల 18న ఇంటర్వ్యూలు నిర్వహించారు. 12మంది టీచర్లు హాజరుకాగా.. ఒకరు గైర్హాజరయ్యారని డీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇంటర్వ్యూలు ముగియడంతో పోస్టులు దక్కించుకునేందుకు పైరవీలు ముమ్మరం చేశారు. అనంతపురం జిల్లాలో ఒకరు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో ఈ శాఖలో పనిచేస్తున్న మరొకరు ఈ పైరవీకారులతో ఒప్పందం చేసుకుని, వివిధ రూపాల్లో ఒత్తిళ్లు తీసుకొస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీలో పారదర్శకత పాటిస్తారా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

'అమరవీరులను స్మరించుకోవడం బాధ్యత'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): వీరమరణ పొందినవారిని, మన పూర్వీకులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని కలెక్టర్ ఆనంద్ సూచించారు. మహాలయ పక్షాలను పురస్కరించుకుని సాయి ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న మోక్ష నారాయణ ముక్తిహోమం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... మనకోసం, మన దేశ భవిష్యత్తుకోసం ప్రాణత్యాగం చేసిన వీర సైనికులు, పోలీసుల ఆత్మశాంతి కోసం మోక్ష నారాయణ ముక్తిహోమం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు సకాలంలో అందజేయండి

● కలెక్టర్‌కు సీపీఐ నాయకుల వినతి

అనంతపురంవిద్య, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్ మొదలైందని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యూరియా సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి విన్నవించారు. సీపీఐ జిల్లాకార్యదర్శి పాళ్యం నారాయణస్వామి మాట్లాడుతూ జిల్లాలో 26,839మెట్రిక్‌టన్నులయూరియా అవసరమని ఇప్పటివరకు 15,241మెట్రిక్‌టన్నుల యూరియాను మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. మిగిలిన యూరియాను తెప్పించి రైతులకు సకాలంలో పంపిణీ చేయాలన్నారు. అలాగే ప్రత్యామ్నాయ పంటలసాగు కోసం పెసర, అలసంద, ఉలవ, సద్ద, జొన్న, కొర్ర, రాగి విత్తనాలను, ఎరువులను రైతుభరోసాకేంద్రాలద్వారా పంపిణీ చేయించాలన్నారు. ఇంకా పలు సమస్యలపై విన్నవించి పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, తలారినారాయణస్వామి, రమణయ్య, రాజేష్‌గౌడ్, కృష్ణుడు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి న్యాయం చేయాలని వినతి

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా ఓడీసీ మండలం తుమ్మల కుంట్లపల్లికి చెందిన దివ్యాంగుడు అంజనప్పకు మెగా డీఎస్సీ నియామకాల్లో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని దివ్యాంగుల సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లో వారు కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ వీహెచ్ కేటగిరిలో మెగా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో దివ్యాంగుడు (బ్లైండ్) అంజినప్పకు 329 ర్యాంక్ వచ్చిందన్నారు. అంజనప్ప తర్వాత 436 ర్యాంక్ కలిగిన మరో దివ్యాంగుడి పేరును జాబితాలో చేర్చారన్నారు. అయితే అంజినప్ప పేరును చేర్చలేదన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి, అంజనప్పకు డీఎస్సీలో ఉద్యోగ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీఎస్సీ నియామకాల్లో తప్పులకు చోటు కల్పించిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్, సహాయ కార్యదర్శి రాజేష్, బాధితుడు అంజనప్ప తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సర్పంచు త్రిలోక్ నాయుడు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వక్తలు సూచించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని మన్నీలలో శుక్రవారం ఎస్కేయూ కళాశాల ఆఫ్ ఎడ్యుకేషన్, రైట్‌వే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మొబైల్ వాడకం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఇందులో ఎస్కేయూ రెక్టార్ వెంకటనాయుడు, ఫార్మసీ ప్రిన్సిపాల్ సోమశేఖర్, గ్రామ సర్పంచు త్రిలోక్ నాయుడు, కేహెచ్ మైండ్ క్యూర్ హాస్పిటల్ ఫౌండర్ డాక్టర్ బాలాజీ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మురళీధర్, మైభారత్ స్టేట్ కోఆర్డినేటర్ భరత్, స్థానిక పాఠశాల హెచ్‌ఎం ఏలీయాజార్ హాజరై మాట్లాడారు. ప్రస్తుతం చాలామంది యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారన్నారు. అలాగే చిన్నపిల్లలు సెల్‌ఫోన్లు అధికంగా చూస్తూ ఆరోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా వాటి జోలికి వెళ్లరాదని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



డేవిడ్ ప్రశాంత్ కుమార్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడేమృతి చెందారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. స్థానికుడైన డేవిడ్ ప్రశాంత్‌కుమార్(60) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకు ఎలక్ట్రికల్ స్కూటీలో బయలుదేరాడు. జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా పెనుకొండ వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఢీ కొంది. ప్రమాదంలో డేవిడ్ ప్రశాంత్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. రామగిరి సీఐ శ్రీధర్, ఎస్‌ఐ సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య శైలజ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఒకరికి తీవ్రగాయాలు..

నార్పల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిమిదొడ్డి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. నడిమిదొడ్డికి చెందిన బెస్త రామకృష్ణ బైక్‌లో నాయనపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తున్నాడు. గ్రామ సమీపంలోకి రాగానే నార్పల నుంచి తాడిపత్రి వైపు వెళ్తున్న కారు ఢీ కొంది. ప్రమాదంలో రామకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నవరాత్రులను విజయవంతం చేయండి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకురాలు, మాజీ కార్పొరేటర్ బిందుప్రియ పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాల కరపత్రాలను ఆలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి రోజుకొక అలంకరణ చేయడంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఏళ్ల నాటి సమస్యలు పరిష్కారం

- పాపంపేట శ్మశాన వాటికలో నీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన
- స్థానికులకు ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే పరిటాల సునీత



శ్మశాన వాటిక వద్ద నిర్మించిన నీటి ట్యాంక్, ఏర్పాటు చేసిన విద్యుత్ బల్బు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పాపంపేట శ్మశాన వాటికలో ఏన్నో ఏళ్లుగా పేరుకుపోయిన పలు సమస్యలు ఎట్టకేలకు పరిష్కారమయ్యాయి. అక్కడ మృతదేహాలను ఖననం చేసిన తర్వాత చేతులు, కాళ్లు కడుక్కునేందుకు నీటి సౌకర్యం లేదు. అలాగే విద్యుత్ సౌకర్యమూ లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడేవారు. ఈ సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలు ఎమ్మెల్యే పరి టాల సునీత దృష్టి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె రూ.2.21లక్షలు పంచాయతీ నిధులు మంజూరు చేయించారు. వాటితో ఇటీవల స్మశాన వాటిక వద్ద ట్యాంక్ నిర్మాణం చేశారు. ద్వారకా విలాస్ ప్రధానరోడ్డు నుంచి పైపులైన్ చేసి నీటి సరఫరా చేశారు. ఇక విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లను కూడా వేయించారు. శ్మశాన వాటిక కు రోడ్డు నిర్మాణం కూడా చేస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు.

భూసార పరీక్షలపై అవగాహన



భూసార పరీక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారి

గార్లదిన్నె, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనంతపురం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం 7, 8, 9 తరగతుల విద్యార్థులకు భూసార పరీక్షలు ఎలా చేస్తారు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించేందుకు భూసార పరీక్షలు ఎంతో ప్రయోజనం కలిగిస్తాయని అన్నారు. భూసార పరీక్షల ద్వారా భూమిలో ఉన్న పోషకాలు తెలుసుకోవచ్చునన్నారు. అలాగే ఎరువులు ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుందని చెప్పారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా పాఠశాలకు రూ.లక్ష విలువ చేసే భూసార పరీక్ష మొబైల్ కిట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాకే సతీష్, సైన్స్ టీచర్ రిజ్వాన, పీఈటీ వెంకటేష్, ఏఈఓ హరి, ఆత్మా ఏటీఎం అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణాల తనిఖీ



ఓ దుకాణంలో నిల్వ ఉంచిన మాంసాన్ని పరిశీలిస్తున్న తస్లీం

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాంసం విక్రయాలు నిర్వహించే దుకాణాల్లో ఫుడ్‌సేఫ్టీ అధికారిణి తస్లీం శుక్రవారం ఆకస్మికంగా తనఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి పరిసరాలను, నిల్వ ఉంచిన మాంసాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పరిశుభ్రత, ఆహార నిల్వనాణ్యతలను పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసినా.. దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించకపోయినా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పలు దుకాణాదారులకు, అపరిశుభ్రతున్న దుకాణాలకు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గార్లదిన్నె, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామ సమీపంలో గల పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 19మందిని అరెస్టు చేశామని సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. అలాగే వారి నుంచి రూ. 65,140 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసినట్లు చెప్పారు.

రాష్ట్రస్థాయి నృత్యపోటీలకు వికాస్ విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్, టీచర్లు

అనంతపురం విద్య, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): నృత్యపోటీలలో నగరంలోని శ్రీవికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 9న స్థానిక అశోక్‌నగర్‌లో గల ఇండోర్‌స్టేడియంలో జిల్లాస్థాయి నృత్యపోటీలు జరిగాయి. ఇందులో వికాస్ విద్యార్థులు సుహాని, మనస్వి, చిన్మయి, శశిధర్ బృందాలు పాల్గొని అత్యంతప్రతిభ చూపారు. ఆ బృందాల్లోని షణ్ముఖప్రియ, హేమల్‌సాయి, కార్తీక్, అబ్దుల్ రిహాన్, అశ్విక్, ఆలీఖాన్, ప్రియాంక, స్నేహితరెడ్డి రాష్ట్రస్థాయినృత్యపోటీలకు ఎంపికయ్యారు. ఈవిద్యార్థులను శుక్రవారం కరస్పాండెంట్ ఖలీల్, టీచర్లు అభినందించారు.

పాముకాటుతో మహిళ మృతి



అంజక్క (ఫైల్)

రామగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యాలమ్మపల్లి గ్రామానికి చెందిన అంజక్క(45) పాముకాటుకు గురై శుక్రవారం మృతి చెందింది. అంజక్క ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బాత్‌రూంలోకి వెళ్లింది. అక్కడ ఉన్న పాము ఆమెను కాటు వేసింది. కుటుంబసభ్యులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిన ట్లు నిర్ధారించారు. అంజక్క కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేది. మృతురాలికి భర్త నాగన్న ఉన్నారు. వీరికి సంతానం లేదు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై సమావేశం

శింగనమల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ భాస్కర్ మండల అధికారులతో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం జరిగే ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్‌లో భాగంగా మండలంలో 12,700 మొక్కలను నాటడానికి ప్రణాళిక తయారు చేశామన్నారు. అన్నిశాఖల సహకారంతో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైతుల పొలాల్లో మొక్కలు నాటనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఈఓ నరసింహరాజు, ఏపీఎం ఈశ్వరయ్య, ఏపీఓ సౌభాగ్య తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్థక శాఖ జేడీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన జేడీ ప్రేమ్‌చంద్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశుసంవర్థక శాఖ జేడీగా ప్రేమ్‌చంద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పశుసంవర్థక శాఖ రాష్ట్ర డైరెక్టరేట్‌లో డీడీగా ఉన్న ఆయను ఉద్యోగోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇన్‌చార్జి జేడీ సుధాకర్ ఆయనకు బాధ్యతలు అప్పగించారు. నూతన జేడీకి ఆ శాఖలోని పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రేమ్‌చంద్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలోని పాడి రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా ప్రత్యేక చొరవ చూపుతామన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి

రాప్తాడు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ వెంకటేష్ సూచించారు. మండలంలోని గాండ్లపర్తిలో శుక్రవారం ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో ఆయన పాల్గొని అనారోగ్యంగా ఉన్న 42 పాడి ఆవులకు చికిత్సలు చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 1350 విలువ చేసే పెయ్య దూడల సూదులను రాష్ట్రీయ గోకుల్ మిషన్‌ద్వారా రాయలసీమలో ఉచితంగా పంపిణీ చేస్తోందని తెలిపారు. రైతులు పెయ్య దూడల పొందడం ద్వారా లాభపడతారన్నారు. ఆ దూడలు ఆవులుగా పెరిగినప్పుడు పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఈ విధంగా రైతులు లాభపడతారన్నారు. కార్యక్రమంలో రాప్తాడు ఏడీఏ ప్రకాష్, సింగనమల ఏడీఏ పద్మనాభం, సర్పంచ్ నరేష్, పశు వైద్యులు శ్రీకాంత్, శ్వేత, సోమేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలపై చర్చించాలి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకులు ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీలో చర్చించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ మేరకు ఎస్కేయూ ప్రధాన గేట్ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. వైద్య విద్య ప్రైవేటీకరణ ఆపాలన్నారు. జీఓ నెంబరు 77ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు షైనుద్దీన్, రమణయ్య, నాయకులు సాయి, మహేష్, శీనునాయక్, జగదీష్, మహేష్‌బాబు, మోహన్‌బాబు, సాయి వీరేంద్ర కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలో దేశ నిర్మాణం: వీసీ



ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్‌లో ఎంపికైన విద్యార్థులతో వీసీ, రిజిస్ట్రార్

అనంతపురంరూరల్, సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో యువత చురుకైన పాత్ర పోషించాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ సుదర్శన్‌రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ.. దేశ పురోగతిలో యువతే కీలకమన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శారద మాట్లాడుతూ.. శిబిరంలో ఎంపికైన వారు గుజరాత్‌లో నిర్వహించే పదిరోజుల ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరంలో పాల్గొంటారన్నారు. అక్కడ ఎంపికైన వారికి 2026 జనవరి 26న ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ హైదరాబాద్ ప్రాంతీయ సంచాలకుడు రామకృష్ణ, జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డుపై పేరుకున్న చెత్తాచెదారం

- నిల్వ ఉన్న మురుగునీరు
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, వాహనదారులు



రోడ్డుపై డస్ట్‌బిన్ పక్కన పేరుకుపోయిన చెత్త, నిల్వఉన్న మురుగునీరు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జీసస్‌నగర్-విద్యుత్తునగర్ ప్రధాన రహదారిలో చెత్తాచెదారం పేరుకుపోయింది. అక్కడ ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ నిండిపోయి.. పక్కన పెద్దఎత్తున చెత్త పేరుకుపోయింది. అలాగే మురుగునీరు కూడా నిల్వ ఉంది. దీంతో వాటి నుంచి వచ్చే దుర్గంధంతో అటువైపు రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానికప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలిసినా నగరపాలక సంస్థలోని పారిశుధ్య అధికారులు, సిబ్బంది పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజూ చెత్త తొలగించి.. మురుగు తీస్తున్నారని చెబుతున్న అధికారులకు నిత్యం జనసంచారం ఉండే నడిరోడ్డుపై పేరుకుపోయిన చెత్త, మురుగు కనిపించలేదా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి గుండా జీసస్‌నగర్, విద్యుత్తునగర్, హౌసింగ్‌బోర్డు, నాయక్‌నగర్, అరవిందనగర్, ఆదర్శనగర్, సెవెన్‌హిల్స్ కాలనీలకు ప్రజలు రాకపోకలకు సాగిస్తుంటారు. అటువంటి రహదారిపై చెత్త, మురుగు తొలగించకుండా నాలుగైదు రోజులుగా అలాగే ఉంచారు. ఇప్పటికైనా పారిశుధ్య సిబ్బంది స్పందించి చెత్త, మురుగు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

రామగిరి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సంఘం మండల నాయకులు నారాయణ, ఓబన్న, ఓబులేశు, రమేశ్ మాట్లాడుతూ.. వీఆర్‌ఏల ప్రధాన సమస్యలైన పేస్కేలు అమలు చేయాలని, నామినీలను వీఆర్‌ఏలుగా నియమించాలని, అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా ప్రమోషన్లు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో వీఆర్‌ఏలతో కలిసి త్వరలోనే చలో అమరావతి కార్యక్రమం చేపడతామన్నారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం: సీడీపీఓ



మాట్లాడుతున్న సీడీపీఓ లలితమ్మ

శింగనమల, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ చల్లా లలితమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం 8వ రాష్ట్రీయ పోషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పౌష్టికాహారం వల్ల జరిగే ప్రయోజనలపై అవగహన కల్పించారు. వాటిని ప్రతి ఒక్కరూ తప్పక తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. తర్వాత అందరూ గ్రామ పురవీధుల్లో అవగాహనర్యాలీ ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు కల్పన, నేతాజీ ధనలక్ష్మి వాణిశ్రీ, కౌసల్య ఓబిలేసు, అంగన్‌వాడీ కార్యకర్తలు భారతి,ప్రమీలా, రామాంజినమ్మ,ఆదిలక్ష్మి,రుషింగమ్మ,సుబ్బరత్నమ్మ, హెల్పర్లు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయండి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఆదివారం ఉదయం 10 గంటలకు అగ్రహారం బిక్కి నాగమ్మ స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ సభ జరగనుందని, విజయవంతం చేయాలని సీనియర్ సాహితీవేత్త డాక్టర్ శాంతినారాయణ శుక్రవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రచయిత అగ్రహారం సత్యనారాయణ రచించిన 'అక్షర విన్యాసములు', 'గేయములు - పాటలు' పుస్తకాలను ఆవిష్కరించనున్నట్లు చెప్పారు. కావున సాహితీకారులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కక్కలపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కక్కలపల్లిలో శుక్రవారం టీడీపీ నాయకులు స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ చేపట్టారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు నారాయణస్వామి, సచివాలయ అధికారి సురేష్‌తో కలిసి రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. డీలర్ మసూద్, నాయకులు అన్వర్ బాషా, బాబాఫకృద్దీన్, కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మండలంలోని నిదనవాడ, సి.బండమీదపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు ఇంటింటికీ తిరిగి రేషన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రాయుడు, విశ్వనాథ్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శీనా, నగేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నిబంధనలకు విరుద్ధంగా సమగ్రశిక్ష పాలన'

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా సమగ్రశిక్ష శాఖ పరిపాలన సాగిందని ఆర్ఎస్‌పీఎస్ అధ్యక్షుడు ఉజ్వల్ వాపోయారు. ఈ మేరకు శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను కలిసి సమగ్రశిక్ష అక్రమాలను వివరించారు. రిజర్వేషన్ వర్గాలకు హక్కులను కల్పించేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, అయితే అధికారులు మాత్రం ఉద్యోగుల హక్కులను కాలరాస్తూ నియామకాలు, ప్రమోషన్‌లు ఇస్తున్నారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, ఆదినారాయణ, ముత్యాల్‌రాజ్, మారెప్ప తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌డీఓ మంజులకు సన్మానం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో డీఎస్‌డీఓ నూతనం గా బాధ్యతలు స్వీకరించిన మంజులను శుక్రవారం ఘ నంగా సన్మానించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్, అథ్లెటిక్ అసోసియేషన్ సభ్యులు, కోచ్‌లు సంయుక్త ఆధ్వర్యంలో మంజులను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అనంతరం మంజుల మాట్లాడుతూ జిల్లాలో క్రీడాభివృద్ధికి అందరం సమిష్టి కృషితో పనిచేస్తామని తెలిపారు. ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, కన్వీనర్ రవికుమార్, కో కన్వీనర్ సుదర్శన్, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో తిమ్మప్పకు..

అనంతపురం రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని యూనివర్సిటీల నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తిమ్మప్పను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం టైంస్కేల్ ఉద్యోగులు సన్మానించారు. విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఆయనకు పూలమాలలు, శాలువాలతో ఘన సన్మానం చేశారు. టైంస్కేల్ అసోసియేషన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మన డబ్బులు-మన లెక్కలపై అవగాహన

అనంతపురం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తపోవనంలో డ్వాక్రాసంఘాల మహిళలు మన డబ్బులు-మనలెక్కలు మొబైల్ యాప్‌పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీపీఎం-ఐబీ రాజ్యలక్ష్మి, ఏపీఎం రవి హాజరయ్యారు. తపోవనంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీని కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘాలలో ఆర్థిక లావాదేవీల నిర్వాహణ, ఈ-నారీల విధులు, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు, ఏపీజీబీ తపోవనం బ్రాంచ్ మేనేజర్ పవన్, వెలుగు సీసీ, వీఓఏలు, ఈ-నారీలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఏపీఐఐసీ డైరెక్టర్



సీఎంకు జ్ఞాపికను అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌బాబు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన చల్లా లక్ష్మీప్రసాద్ బాబు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. విజయవాడలో శుక్రవారం సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందించి, శాలువా కప్పి సత్కరించారు. కష్టపడిన వాళ్లకు ఎప్పటికీ టీడీపీలో గుర్తింపు ఉం టుందని, పార్టీకి, ప్రభుత్వానికి, మంచి పేరు తెచ్చేలా పని చేయాలని ముఖ్యమంత్రి తనకు సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

ఇంటి వద్దకే స్మార్ట్ రేషన్‌కార్డులు



స్మార్ట్ రేషన్ కార్డును అందజేస్తున్న అధికారులు

యాడికి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటివద్దకే వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలున్నా.. అధికారులు, సచివాలయ సిబ్బంది వాటిని డీలర్లకు అంటగట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో ఏ కార్డు ఎక్కడ ఉందో తెలీక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై గందరగోళం.... స్మార్ట్‌కార్డుల పంపిణీలో అధికారుల నిర్లక్ష్యం పేరుతో ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. మేలుకున్న అధికారులు స్మార్ట్ రేషన్ కార్డులను ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నారు. ఇంటి వద్దకే కార్డుల పంపిణీని తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో దామోదర్‌నాయుడు పరిశీలించారు.

యూరియా కోసం నిలదీత

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం, చెలిమేపల్లి గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం యూరియా పంపిణీ చేశారు. అయితే ఒక్కో పాసుపుస్తకానికి ఒక బస్తా యూరియాను మాత్రమే ఇవ్వడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం ఒక పాస్ బుక్‌కు నాలుగు బస్తాలైనా ఇవ్వాలని అధికారులను నిలదీశారు.

ఎంఈఓగా మహమ్మద్ ఇర్షాద్



రాయదుర్గంరూరల్,సెప్టెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలం ఎంఈఓ-1గా మహమ్మద్ ఇర్షాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంఈఓ నాగమణి ఉద్యోగ విరమణ కారవడంతో .. అనంతపురం న్యూటౌన్ ఎంఈఓ మహమ్మద్ ఇర్షాద్‌ను ఇక్కడి నియమించారు.

సీపీఐ నాయకుల అన్నదానం

గుంతకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ జగదీశ్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆ పార్టీ నాయకులు శుక్రవారం స్థానిక అనురాగ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్ గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాయల్ రాము, దేవేంద్ర, పీసీ కుళ్లాయప్ప, పుల్లయ్య, ఉమర్ బాషా, వెంకట నాయక్, రోహిత్, ఫర్హాన్, పాల్గొన్నారు.

స్మార్ట్‌కు సర్వర్ సతాయింపు

గుత్తి సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సర్వర్ సమస్యల వల్ల స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ మందకొడిగా సాగుతోంది. మండలంలో 24,910 రేషన్ కార్డులు ఉన్నాయి. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ వార్డు గ్రామ సచివాలయ వీఆర్వోలు రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నారు. దీనికి సర్వర్ సమస్య కూడా తోడు కావడంతో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీలో జాప్యం జరుగుతోంది. దీనిపై సీఎస్‌డీటీ ప్రవీణ్‌కుమార్‌ను వివరణ కోరగా.. సర్వర్, సిబ్బంది కొరత సమస్యలు ఉన్నాయని, వాటిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి .. పరిష్కరించి.. కార్డులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

తాడిపత్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం శాశ్వత హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కించినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. 2025 మార్చి 18 నుంచి 2025 సెప్టెంబరు 19వరకు హుండీల ద్వారా మొత్తం రూ.11,96,341 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తిరుపాల్‌రెడ్డి, అర్చకులు సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి
రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు

ఉరవకొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెంట్రల్ హైస్కూల్, ఆర్డీటీ ఫీల్డ్ ఆఫీస్‌లో ఆది, సోమవారాల్లో రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు సెపక్‌తక్రా అసోసియేషన్ చైర్మన్ సప్తగిరి మల్లికార్జున తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని 26 జిల్లాల బాల బాలికలు పాల్గొంటారన్నారు. ఇక్కడ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఉత్తరాఖండ్‌లో వచ్చే నెలలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు.

● క్రీడా దుస్తుల అందజేత : రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఎస్కేఆర్సీ క్లబ్ సభ్యులు క్రీడా దుస్తులు అందజేశారు. ఈ పోటీలకు ఆ క్లబ్ తరపున రూ.20వేల విలువ చేసే మెమెంటోలు, షీల్డ్, క్రీడా దుస్తులను అందజేసినట్లు క్లబ్ ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి నాయుడు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీంద్రనాథ్, సెపక్‌తక్రా సంఘం జిల్లా అధ్యక్షులు షాహిన్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం అందేలా చేస్తాం

బాధిత రైతుకు ఆర్డీఓ భరోసా



బాధిత రైతుతో మాట్లాడుతున్న ఆర్డీఓ

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్వారీ పేలుళ్ల నుంచి వెలువడే దుమ్ము ధూళితో తన పంటలు నాశనమయ్యాయని మండలంలోని ముదిగల్లు గ్రామానికి చెందిన రైతు బొమ్మయ్య గురువారం ఆత్మహత్యకు యత్నించిన విషయం తెల్సిందే. శుక్రవారం ఆ రైతును తమ కార్యాలయానికి పిలిపించుకొని సమస్యను ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ భాస్కర్ అడిగి తెలుసుకున్నారు. పంట నష్టానికి పరిహారం అందించేలా చూస్తామన్నారు. భవిష్యత్తులో ఆ క్వారీ నుంచి వెలువడే దుమ్ముధూళితో ఏ మాత్రం పంటలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బొమ్మయ్య పొలాన్ని అధికారులు పరిశీలించారు.

సదరం సర్టిఫికెట్ కోసం నిరీక్షణ



పక్షవాతంతో మంచానికే పరిమితమైన చంద్రప్ప

శెట్టూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప పక్షవాతం సోకి మంచానికి పరిమితమయ్యాడు. అతను సదరం సర్టిఫికెట్ కోసం 2024 అక్టోబరు 16న దరఖాస్తు చేసుకున్నా.. నేటికి ఆ సర్టిఫికెట్ అందలేదు. దీంతో పింఛన్ మంజూరుకాక ఇబ్బందులు పడుతున్నాడు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సదరం సర్టిఫికెట్, పింఛన్ మంజూరు చేయాలని అతని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సమయపాలనకు నీళ్లు!

● దేవగిరి సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం
● ఎప్పుడు వెళ్లినా ఖాళీ సీట్లే దర్శనం



శుక్రవారం ఉదయం 11 గంటలకు ఖాళీగా ఉన్న దేవగిరి సచివాలయం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగిరి గ్రామ సచివాలయ సిబ్బంది విధులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉద్యోగులు విధులకు సక్రమంగా రావడం లేదనీ, వచ్చినా కొంత సేపు ఉండి వెళ్లిపోతున్నారనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ సచివాలయాన్ని ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. ఇంజనీయర్ అసిస్టెంట్ మాత్రమే విధులకు వచ్చి గ్రామంలో స్మార్ట్ కార్డులు పంపిణీకి వెళ్లారు. ఇక మిగిలిన సిబ్బంది ఎవరూ విధులకు రాలేదు. కార్యాలయం మొత్తం ఖాళీగా ఉంది. పలు సమస్యలపై వచ్చిన గ్రామస్థులు.. సిబ్బంది ఎవరూ లేకపోవడంతో నిరాశతో తిరిగి వెళ్తున్నారు. ఉద్యోగులు ప్రతి రోజు సక్రమంగా విధులకు రావడంలేదని, ఇష్టమొచ్చిన వేళకు వచ్చి వెళ్తున్నారని, పంచాయతీ కార్యదర్శి రెండు నెలలగా గ్రామానికి రావడంలేదని ఆ గ్రామస్థులు చెప్పారు.

డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

తాడిపత్రి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): దస్తావేజుదారులు స్థానిక రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా నిరసన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విధానాలతో కక్షిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆధార్, ఓటీపీ, మొబైల్ వెరిఫికేషన్ ఓటీపీలు అడగడం ఎడిటింగ్ ఆప్షన్ తీసివేయుట తదితర సమస్యలతో సతమతం అవుతున్నారన్నారు. స్లాట్ బుకింగ్ అయిన తర్వాత ఎడిట్ ఆప్షన్ లేక మరళా స్లాట్ బుకింగ్ కొరకు చలానాలు అదనపు భారం కక్షిదారులపై పడుతోందన్నారు. భూమికి సంబంధించి ఒక సర్వేనెంబరులో విస్తీర్ణంలో ఒకరికి తప్ప మరొకరిది రిజిస్ట్రేషన్లు చేయడానికి వీలు కావడం లేదన్నారు. వృద్ధులకు ఫింగర్ ప్రింట్స్, ఐరిష పనిచేయడం లేదన్నారు. అనంతరం సబ్ రిజిస్ట్రర్ శివకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దస్తావేజుదారులు వలి బాషా, కొండయ్య, పరమేశ్, జనార్దన, రమేష్ బాబు, కేవీ రమణ పాల్గొన్నారు.



యాడికిలో నిరసన వ్యక్తం చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

● యాడికి : రిజిస్ట్రేషన్ శాఖలో నూతన విధానాలను వ్యతిరేకిస్తూ యాడికిలోని డాక్యుమెంట్ రైటర్లు శుక్రవారం పెన్‌డౌన్ చేశారు. ఈ నూతన విధానాల వలన ఆస్తులు రిజిస్ట్రేషన్లకు సంబంధించి క్రయ, విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. సబ్ రిజిస్ట్రార్ జాఫర్‌సాదిక్‌కు వినతి పత్రం అందజేశారు. ఇందులో డాక్యుమెంట్ రైటర్లు రజాక్, నరేష్, నవీన్, కేశవయ్య, ఈశ్వర్య, రుక్మానంద, రత్నకుమార్ పాల్గొన్నారు.

● గుత్తి: స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్లు బండి సత్య, నరేష్, మీరన్ రంగస్వామి, రఘు, సిరాజ్‌ఉద్దిన్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లను తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గుంతకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణుల కడుపు కొడుతున్న కార్పొరేట్ సెలూన్లను తొలగించాలని, కొత్తవాటికి అనుమతులు ఇవ్వరాదని క్షౌర వృత్తిదారుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కమిషనర్ నయ్యీం అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో క్షౌర వృత్తిదారుల సంఘ జిల్లా కన్వీనరు బీ శ్రీనివాసులు, అధ్యక్షుడు బీ లక్ష్మీనారాయణ, కార్యదర్శి సూరి, కోశాధికారి ఎం బ్రహ్మకుమార్, నాయకులు పాల్గొన్నారు.

తగినంత యూరియా ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు తగినంత యూరియా పంపిణీ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బీ మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏడీఏ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులకు వినతి పత్రం అందించారు. మల్లికార్జున మాట్లాడుతూ.. అధిక వర్షాలు, హెచ్చెల్సీకి నీరు రావడంతో రైతులకు అధికంగా యూరియా అవసరమైందని, తగినంత యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా పుష్కలంగా ఉందంటూ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని మండిపడ్డారు.

ద్విచక్ర వాహనాల వేలం

కణేకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్నట్లు తొమ్మిది ద్విచక్రవాహనాలను స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం వేలం వేశామని, తద్వారా ప్రభుత్వానికి రూ. 1.14 లక్షలు ఆదాయం వచ్చిందని ఎక్సైజ్ సీఐ ఉమాబాయి తెలిపారు. ఎక్సైజ్ సూపరిండెంట్ రామ్మోహన్ ఆధ్వర్యంలో వాహనాలను వేలం వేశామన్నారు. అలాగే వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 63 లీటర్ల అక్రమ మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు.

● వారపు సంత...

బొమ్మనహాళ్: గోవిందవాడలో ప్రతి బుధవారం నిర్వహించే వారపు సంతలో సుంకం వసూలకు అధికారులు గ్రామ సచివాలయంలో డిప్యూటీ ఎంపీడీఓ దాస్ ఆధ్వర్యంలో శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి ఏడుగురు పాల్గొన్నారు. వారపు సంతలో సుంకం వసూలను రూ. 92 వేలకు గోవిందవాడకు చెందిన వన్నూరుస్వామి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

వీఆర్ఏల ఆందోళనకు సంఘీభావం

గుంతకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం, జీతాల పెంపు.. తదితర డిమాండ్లతో ఆందోళన చేపట్టిన వీఆర్ఏకు తహసీల్దారు రమాదేవి సంఘీభావం తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్ఏలు చేపట్టిన ఆందోళన శిబిరం వద్దకు వచ్చిన తహసీల్దార్ మాట్లాడుతూ.. గ్రామ రెవెన్యూ సహాయకుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుభూతితో పరిష్కరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వీఆర్ఓల సంఘ మండల అధ్యక్షుడు తలారి కృష్ణ, నాయకులు ఈ ఆందోళనకు మద్దతు పలికారు.



వీఆర్ఏల ఆందోళనకు సంఘీభావం తెలుపుతున్న తహసీల్దారు

పీఆర్సీని నియమించాలి

గుంతకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉద్యోగుల జీతాల సవరణ కోసం ఎనిమిదవ పే రివిజన్ కమిషన్‌ను (పీఆర్సీ) నియమించాలని మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఆర్ఎఫ్, రైల్వే మజ్దూర్ యూనియన్ సంయుక్త పిలుపు మేరకు డివిజనల్ కేంద్రంలోని వివిధ కార్యాలయాల వద్ద ఉద్యోగులు, కార్మికులు శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ ఎదుట చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడారు. ఎనిమిదవ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పీఆర్సీ కోసం వెంటనే కమిటీని రూపొందించాలని, లేదంటే జాతీయ స్థాయిలో ఉద్యమాలు ఉధృతం అవుతాయని హెచ్చరించారు. ఇందులో యూనియన్ ఏడీఎస్ శ్రీనివాసులు, వివిధ బ్రాంచ్‌ల నాయకులు ఎస్ఎం బాషా, జాఫర్ ఖాన్, ఎస్ విజయకుమార్, శర్మ, జీవన్ బాబు, రాజశేఖర్, రమేశ్, సుధాకర్, శివాజీ, నజీర్ పాల్గొన్నారు.



గుత్తిలో నిరసన వ్యక్తం చేస్తున్న రైల్వే కార్మికులు

● గుత్తి : రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కారించాలని గుత్తి రైల్వే డీజిల్ షెడ్ ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యాలయాల వద్ద దక్షిణ మధ్య రైల్వే మజ్దూరు యూనియన్ అధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో డీజిల్ షెడ్ బ్రాంచ్ కార్యదర్శి రామాంజిరెడ్డి, ఏడీఎస్ నారాయణ, ఓపెన్ లైన్ బ్రాంచ్ కార్యదర్శి శేఖర్ బాబు, రైల్వే ఇన్‌స్టూట్ కార్యదర్శి రసూల్ నాయకులు మనోహర్, క్రిష్ణనాయక్, కరీమ్ పాల్గొన్నారు.

హామీలపై అసెంబ్లీలో చర్చించాలి: ఏఐఎస్ఎఫ్

కళ్యాణదుర్గంరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాయకులతో కలిసి ఆర్డీఓ వసంత్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేసిన ఆయన మాట్లాడారు. రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయరాదని, ఉన్నత విద్యకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని, డిగ్రీ అడ్మిషన్లను పాత విధానంలో కొనసాగించి సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. అలాగే విద్యార్థి సంఘాల నాయకులు విద్యాసంస్థల్లోకి ప్రవేశించకుండా తీసుకువచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని, విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి పరిష్కరించాలని కోరారు. వీటిపై స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కోశాధికారి పవన్, గర్ల్స్ కన్వీనర్ మౌలిక, ఉపాధ్యక్షులు హర్షవర్ధన్ పాల్గొన్నారు.

● ఉరవకొండ : డిగ్రీ అడ్మిషన్ల ఆన్‌లైన్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు చందు, రాజేష్, కర్ణాకర్, లాల్‌స్వామి, కాశీం, సిద్ధిక్, మన్సూర్‌వలి పాల్గొన్నారు.





కళ్యాణదుర్గంలో ఆర్డీఓకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, ఉరవకొండలో నాయకులు, విద్యార్థుల నిరసన

పాఠశాల భవన నిర్మాణ పనుల పరిశీలన

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు కింద మండలంలోని పాల్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాణాన్ని చేపట్టింది. అయితే నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ పనులు ఆగిపోయాయి. ఆగిన ఆ భవన నిర్మాణాన్ని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన సొంత డబ్బు రూ.50 లక్షలతో పూర్తి చేసేందుకు ముందుకు వచ్చారు. ఆ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎస్సార్సీ ట్రస్టు ప్రతినిధి, బీఎస్ఎన్ఎల్ టీ ఏసీ మెంబర్ అమర రామమోహన్ దగ్గరుండి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. కాగా, ఈ పనులను జిల్లా ఉప విద్యాశాఖాధికారి బీ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం మండల విద్యాశాఖాధికారి విజయ కుమారి శుక్రవారం పరిశీలించారు. వారి వెంట పాఠశాల హెచ్ఎం అనంతనేని వెంకటేష్, పాఠశాల కమిటీ చైర్మన్ హనుమంతరాయుడు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

క్రైం న్యూస్..

లారీలు ఢీ



యాడికి, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండేకల్లు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రెండు లారీలు ఢీకొన్నాయి. తాడిపత్రి నుంచి బళ్లారి వైపు వెళుతున్న లారీ... గుత్తివైపు నుంచి తాడిపత్రికి వస్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. డ్రైవర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామంలో రైతు సోమశేఖర్ తోటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దుండగులు గురువారం రాత్రి పగులగొట్టిన అందులోని రాగివైరును ఎత్తుకెళ్లారు. వరి నాట్లు వేశానని, నీరు అందకుంటే పంట ఎండిపోతుందని సోమశేఖర్ విలపించాడు. విద్యుత్ అధికారులు స్పందించి త్వరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి.. పంట ఎండకుండా చూడాలని కోరుతున్నాడు. ఈ మేరకు అతను పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. కాగా, రెండు నెలల క్రితం సూగేహళ్లి గ్రామంలో తాగునీటి బోర్లకు అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైరును దుండగులు చోరీ చేశారు. దీనిపై సర్పంచ్ వనిత మల్లికార్జున పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆగివున్న ట్రాక్టర్‌ను బైక్‌లో వెళ్తున్న మండలంలోని ముప్పాలగుత్తి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఢీకొని గాయపడ్డాడు. మండలంలోని బుర్నాకుంట సమీపంలో బండల లోడుతో వెళుతున్న ఓ ట్రాక్టర్ చెడిపోవడంతో దాన్ని రోడ్డు పక్కన గురువారం ఆపారు. రాత్రి రాయలచెరువు నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్న లక్ష్మీనారాయణ.. ఆ ట్రాక్టర్‌ను వెనుకభాగంలో ఢీకొన్నాడు. గాయపడ్డ అతన్ని కర్నూలు ఆసుపత్రికి తరలించారు.

మహిళకు..

గుత్తిరూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి తండా గ్రామంలో గోవిందు, పద్మావతి కుటుంబ సభ్యులు, మాణిక్యమ్మ శుక్రవారం గొడవ పడ్డారు. చిన్నపాటి విషయంలో మాటామాటా పెరిగింది. మాణిక్యమ్మపై వారు దాడి చేశారు. గాయపడిన ఆమెను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండేళ్లుగా నిరుపయోగంగా..

ప్రారంభానికి నోచుకోని ఆస్పత్రి నూతన భవనం



నిరుపయోగంగా ఉన్న పీహెచ్‌సీ నూతన భవనం



ఆస్పత్రిలో ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లు

ఉరవకొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాకెట్ల గ్రామంలో రెండేళ్ల క్రితం రూ. 1.70 కోట్లతో పీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. అయితే దాన్ని ప్రారంభించడంపై పాలకులు, అధికారులు దృష్టిసారించకపోవడంతో అది నేటికీ నిరుపయోగంగానే ఉంది. దీంతో ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. మందుబాబులు అడ్డాగా మారింది. మద్యం మత్తు లో మందుబాబులు ఆసుపత్రి కిటికీలను ధ్వంసం చేశారు. పాత పీహెచ్‌సీ భవనంలోనే డాక్టర్లు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో .. తరచూ విష పురుగులు వస్తుండడంతో సిబ్బంది హడలెత్తిపోతున్నారు. వారం క్రితం పీహెచ్‌సీలోకి ఏకంగా కొండ చిలువ వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన పీహెచ్‌సీని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు రక్త పరీక్షలు

గుంతకల్లు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ స్వచ్ఛంద రక్త వితరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్త పరీక్షలు చేసి బ్లడ్ గ్రూపులను తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు రాఘవ, ఆనంద్, శివకుమారి, అలియాఫ్ హుసేన్, సురేశ్, మెడికల్ ఆఫీసరు పవిత్ర ప్రజ్ఞ, జేవీవీ నాయకుడు హరిప్రసాద్, టెక్నీషియన్లు సత్య, ఉమాదేవి, రాజు పాల్గొన్నారు.